


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 351, పేజీలు - 08

గురువారం, మే 15, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## కాలుష్య కోరల్లో గోదావరి

### - జీవనదికి పెరిగిన ముప్పు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారతదేశంలో రెండో అతిపెద్ద నది,దక్షిణ భారతదేశంలోని ప్రధాన రాష్ట్రాలకు జీవనాడి అయిన గోదావరి నది కాలుష్యం బారిన పడుతోంది.ఈ ప్రభావం తెలంగాణలో ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్, సీఎస్ఐఆర్ - నీరి సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనం పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు నదిలోకి చేరి జలచరాల జీవనానికి మరియు మానవ ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగిస్తున్న కొన్ని ప్రాంతాలను గుర్తించింది.

### తెలంగాణలో ఆందోళనకర స్థాయికి కాలుష్యం

తెలంగాణలోని గోదావరి తీర ప్రాంతాల్లో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. ముఖ్యంగా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్,ఖమ్మం జిల్లాల్లో ఈ ప్రభావం అధికంగా ఉంది. ఈ ప్రాంతాల్లోని కర్మాగారాలు, ప్రభుత్వ రంగ సంస్థలు శుద్ధి చేయని వ్యర్థాలను నేరుగా నదిలోకి విడుదల చేస్తున్నాయి.ఇది బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ స్థాయిలను పెంచుతోంది. భద్రాచలంలో ఈ కాలుష్య సమస్య స్పష్టంగా కనిపిస్తోంది.ఇక్కడ రసాయన మరియు మురుగునీటి కాలుష్యం కారణంగా నది నీరు తరచుగా నల్లగా మారి దుర్వాసన వస్తోంది. పట్టణీకరణ మరియు నదీతీరాలను ఆక్రమించడం కూడా కాలుష్యానికి కారణమవుతున్నాయి.నది పరీవాహక ప్రాంతమంతా అటవీ నిర్మూలన జరగడం కూడా దీనికి తోడైంది. దీని ప్రధాన ఉపనదులైన ప్రాణహిత, ఇంద్రావతి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. భారీగా పేరుకుపోయిన పూడిక మరియు నీటి నాణ్యత తగ్గడం జీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయి. నదిపై ఆధారపడి జీవిస్తున్న అనేక గ్రామాల ప్రజలు చర్మ సంబంధిత వ్యాధులు, జీర్ణకోశ సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలు పెరిగాయని చెబుతున్నారు.కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం పటిష్టంగా లేకపోవడంతో అవి యథేచ్ఛగా వ్యవహరిస్తున్నాయి. పదేపదే హెచ్చరికలు చేసినప్పటికీ, అవి

2లో..

## 52వ సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రమాణం

### - రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారోత్సవం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్రపతి భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించగా ప్రధాని మోడీతో పాటు, కేంద్ర మంత్రులు, ఉప రాష్ట్రపతి, ఇతర అతిథుల పాల్గొన్నారు. మహారాష్ట్రలోని అమరావతిలో 1960 నవంబరు 24న గవాయ్ జన్మించారు. 1985 మార్చి 16న న్యాయవాదిగా కెరీర్ ప్రారంభించారు. ఆ

2లో..

## గ్రేటర్ పౌరసేవల్లో విప్లవాత్మక మార్పులు

### - అధికారులకు రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



**హైదరాబాద్** తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో వివిధ రకాల నిర్మాణాలు, ఇతర సదుపాయాల కల్పనకు సంబంధించిన అనుమతుల ప్రక్రియ సులభతరంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దీనికి సంబంధించి పూర్తి అధ్యయనంతో సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పౌర సేవలు, అనుమతులపై రాష్ట్ర సచివాలయంలో ఈ సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్‌లో వివిధ రకాల నిర్మాణాలకు ప్రజలు పలు విభాగాలకు దరఖాస్తులు చేసుకొని ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి

2లో..

## డ్రోన్లు మాత్రమే కాదు.. పాక్‌కు టర్కీ సైనిక సాయం.?

### - వెలుగులోకి విస్తుగొలిపే విషయాలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత వ్యతిరేక కార్యకలాపాల కోసం పాకిస్థాన్‌కు టర్కీ డ్రోన్లను సరఫరా చేయడమే కాకుండా, తమ సైనిక సిబ్బందిని కూడా పంపిందన్న ఆరోపణలు సంచలనం కలిగిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ సంబంధాలు బలపడుతున్న నేపథ్యంలో ఈ వార్తలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా, 'ఆపరేషన్ సిందూర్' పేరిట

2లో..

## పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టెక్ ఏఐ కాంక్లేవ్

- పాల్గొన్న సీఎం చంద్రబాబు
- తాను ఉదయం పూట కేవలం ఆమ్లెట్ మాత్రమే తింటానని వెల్లడి
- ప్రొటీన్ ఫుడ్ కు ప్రాధాన్యత పెరుగుతోందని వివరణ



**అమరావతి** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాలనలో సాంకేతికత వినియోగానికి పెద్దపీట వేస్తోంది. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని పదే పదే అధికారులకు సూచిస్తున్నారు. పౌర సేవల దగ్గర నుంచి, ప్రజా సమస్యల పరిష్కారం వరకూ ప్రతి అంశానికి సాంకేతికతను జోడించి వేగంగా చర్యలు తీసుకునేలా పనిచేయాలని చంద్రబాబు అధికారులకు ఆదేశిస్తూ ఉంటారు. మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ పేరిట పౌర సేవలను మొబైల్ ఫోన్ ద్వారా అందిస్తున్న ఏపీ ప్రభుత్వం ఇప్పుడు మరో సరికొత్త ప్రయోగానికి సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖలో కీలక మార్పులకు ప్రణాళికలు రచిస్తోంది. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో టెక్ ఏఐ కాంక్లేవ్ నిర్వహించారు. ఈ కాంక్లేవ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగానే ఏపీ పశుసంవర్ధక శాఖ అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఆధార్ కార్డు అందిస్తున్న తరహాలోనే పశువులను కూడా గోధార్‌తో అనుసంధానం చేసే ఆలోచన చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా నుంచి మొదలుపెట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో త్వరలోనే పశువులను గోధార్‌తో అనుసంధానం చేసే ఆలోచనను ఏపీ ప్రభుత్వం చేస్తోంది. మరోవైపు మన దేశంలో ప్రతి పౌరుడికి కేంద్ర

2లో..

## నెలకో పథకం అమలు చేసేలా సంక్షేమ క్యాలండర్

### - టీడీపీ పొలిట్ బ్యూరో సంచలన నిర్ణయాలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ లో నెలకో సంక్షేమ పథకం అమలు చేసేలా ఏడాది క్యాలెండర్ రూపకల్పనకు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో కీలక నిర్ణయం చేసింది. చంద్రబాబు అధ్యక్షతన జరిగిన పొలిట్ బ్యూరో మీటింగ్ లో పథకాలపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. దీపం పథకం కింద

2లో..

## హైదరాబాద్ మెట్రో ఫేజ్2 మలిభాగం డీపీఆర్ రెడీ

### - మార్గాల్లో రూ.19 వేల కోట్లతో ప్రతిపాదనలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రోరైలు సెకండ్ ఫేజ్ మలిభాగం(2 బి) పై కసరత్తు చేస్తోంది. మెట్రో రెండో దశ మలిభాగం కోసం దాదాపు రూ. 19వేల కోట్ల అంచనాలతో డీపీఆర్ సిద్ధమైంది. మొత్తం 3 మార్గాల్లో 86.5 కిలోమీటర్ల మేర మెట్రో లైన్‌ను ప్రతిపాదించారు. జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు, జేబీఎస్ నుంచి మేడ్చల్‌కు, శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు మార్గాల పూర్తి వివరాలను ఇందులో

2లో..

## మూడేళ్లలో కుప్పకూలిన ప్రాజెక్టు కాళేశ్వరం మాత్రమే

- కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ సెటైర్లు
- జలసౌధలో నీటిపారుదల శాఖ ఏఈ, జేటీవోలకు నియామక పత్రాలు
- ప్రాజెక్టుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని ఇంజినీర్లకు సీఎం సూచన
- ఎస్ఎల్‌బీసీ సహా పలు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ
- త్వరలో గ్రూప్స్ నియామకాలు పూర్తి చేస్తామన్న ముఖ్యమంత్రి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మూడేళ్లలో కుప్పకూలిన ప్రాజెక్టు భూ ప్రపంచంలో కాళేశ్వరం మాత్రమేనని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. జలసౌధలో జరిగిన కొలువుల పండుగ కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన వారికి నియామక పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రసంగంలో కీలక వ్యాఖ్యలు చేశారు. నీళ్లు మన నాగరికత, నీళ్ల కోసమే తెలంగాణ ఉద్యమం పుట్టిందని నీళ్ల

2లో..

## భూమికి అదే డెడ్ లైన్

### -జపాన్ పరిశోధకుల అధ్యయనం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భూగోళం భవిష్యత్తుపై జపాన్‌లోని టోహో విశ్వవిద్యాలయ పరిశోధకులు ఆందోళనకరమైన విషయాలను వెల్లడించారు. సుమారు ఒక బిలియన్ (వంద కోట్ల) సంవత్సరాల తరువాత భూమిపై ప్రాణవాయువు అదృశ్యమవుతుందని, తద్వారా ప్రస్తుతం ఉన్న జీవరాశి మనుగడ అసాధ్యంగా మారుతుందని తమ అధ్యయనంలో తేల్చారు. నాసాకు చెందిన గ్రహ నమూనాలను ఉపయోగించి చేసిన ఈ పరిశోధన వివరాలు ప్రఖ్యాత

2లో..

## కర్రెగుట్టలో 31 మంది మావోయిస్టుల హతం

- వెల్లడించిన సీఆర్పీఎఫ్ డీజీ జీపీ సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతం
- సుమారు 21 రోజుల పాటు సాగిన కర్రెగుట్ట ఆపరేషన్
- కీలక ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మృతి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులోని బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలేలా చేశాయి. ఉసురు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్రెగుట్ట కేంద్రంగా చేపట్టిన ఆపరేషన్‌లో మొత్తం 31 మంది మావోయిస్టులు మరణించినట్లు సీఆర్పీఎఫ్ డీజీ జీపీ సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతం ప్రకటించారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను బుధవారం బీజాపూర్‌లో

2లో..

## సింధూ జలాలపై కాళ్ల బేరానికి పాకిస్థాన్

### - భారత్‌కు విజ్ఞప్తి చేస్తూ లేఖ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పాకిస్థాన్ ప్రభుత్వం భారత్‌తో కాళ్ల బేరానికి వచ్చింది. ఉగ్రవాదుల దాడి ఎఫెక్ట్ తర్వాత భారత్ సింధు జలాలను పాక్‌కు వెళ్లకుండా నిలిపివేసింది. ఈ తర్వాత ఇరు దేశాలు కూడా చిన్నపాటి యుద్ధానికి దిగాయి. ఈ యుద్ధంలో పాకిస్థాన్ పాక్షికంగా దెబ్బతింది. మొత్తానికి ఇరు దేశాలు కాల్పుల విరమణకు రావడంతో ప్రస్తుతం సమస్య సద్దుమణిగింది.

2లో..

## ఆ ఘనత తనదేనని చెప్పుకోవడానికి సీఎం తంటాలు పడుతున్నారు

- బీఆర్ఎస్ ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లకు నియామక పత్రాలిచ్చి తమ ఘనతగా సీఎం చెబుతున్నారని విమర్శ
- కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం, ఆయకట్టుపై సీఎం పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని విమర్శ
- కాంగ్రెస్ పాలనలో సాగునీటి రంగం నిర్లక్ష్యానికి గురైందని విమర్శ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన ఉద్యోగ నోటిఫికేషన్లకు ప్రస్తుత ప్రభుత్వం నియామక పత్రాలు అందిస్తూ, ఆ ఘనతను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం

2లో..

## చీరకట్టులో ముద్దుగుమ్మలు

### - రామప్ప, వేయిస్తంభాల గుడి సందర్శన



**వరంగల్ (ప్రశ్న న్యూస్)** కాకతీయుల కళా వైభవానికి ప్రపంచ ముద్దుగుమ్మలు ఫిదా అయ్యారు. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా ఓరుగల్లుకు చేరుకున్న అందాల భామలు రామప్ప, వేయి స్తంభాల గుడిని సందర్శించారు. చూపుతిప్పనివ్వని రామప్ప శిల్పాల హొయలకు

2లో..

# అప్రమత్తంగా ఉండండి.. అధిక సేవలు అందించండి

## - అధికారులకు కలెక్టర్ ఆదేశం.



**జయశంకర్** సరస్వతి పుష్కర విధులు కేటాయయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ 12 రోజులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.బుధవారం కాళేశ్వరం దేవస్థానంలోని కళ్యాణ మండపంలో విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి కేటాయించిన విధుల పట్ల దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో పెద్ద ఎత్తున సరస్వతి పుష్కరాలు జరుపుతున్నామని, అందుకు తగినట్లుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు లక్షకిపైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రం ఆసాంతం అప్రమత్తంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ప్రతి అధికారికి కేటాయించిన లొకేషన్స్ లో ముందస్తుగా పర్యటించి ఏర్పాట్లు పరిశీలన చేయాలని తెలిపారు. గైర్హాజరైన అధికారులకు, సిబ్బందికి ఆయా శాఖలకు తగు చర్యలు నిమిత్తం సిఫారసు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 15వ తేదీ ఉదయం పుష్కరాలు ప్రారంభమవుతాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పుష్కరాలను ప్రారంభించనున్నారని తెలిపారు. 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సరస్వతి మాత విగ్రహం ఆవిష్కరణ, పుష్కర స్నానం తదుపరి స్వామి వారి దర్శనం, గోదావరి హారతి కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారని అనంతరం టెంట్ సిటీ పరిశీలిస్తారని తెలిపారు. కాశీ పండితులతో ప్రత్యేకంగా హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12 సంవత్సరాలకు ఒకసారి జరుగుతున్న ఈ పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని అన్నారు. కుంభమేళా వెళ్లలేని వారు ఇక్కడికి వచ్చే అవకాశం ఉందని ఆ ప్రకారం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ 12 రోజుల విధులు చాలా ముఖ్యమని ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. సరస్వతి ఘాట్ మెయిన్ ఘాట్ వద్ద భక్తులు పుష్కర స్నానాలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. భక్తులకు స్నానాల షవర్లు, బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పింద ప్రధాన కార్యక్రమాలు చేసేందుకు కూడా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. స్టాళ్లు, టెంట్ సిటీ, డార్మెటరీ, ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు తు.చ తప్పక విఐపి ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని కంట్రోల్ రూమ్ కి వచ్చిన సమస్యను తక్షణమే ఆయా శాఖల అధికారులు దృష్టి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాలయంలో భక్తులు క్యూలైన్ పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 50 మంది గజ ఈతగాళ్ళు నాటు పడవలతో పహారా కాస్తున్నట్లు తెలిపారు. విధులు నిర్వహించే అధికారులు సిబ్బందిని పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాత్కాలిక బస్టాండ్ నుంచి ఘాట్స్ వరకు భక్తుల సౌకర్యార్థం ఉచితంగా 30 షటిల్ బస్సులు నడుపుతున్నామని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుష్కరవిధులు కేటాయించిన అధికారులకు రెండు షిఫ్టుల్లో విధులు కేటాయించామని అప్రమత్తంగా ఉండాలని, సమయానికి విధులకు హాజరు కావాలని తెలిపారు. ఎవరైనా గైర్హాజరు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విధులు కేటాయించిన సిబ్బందికి భోజన, వసతి ఏర్పాటు చేస్తున్నామని సమయ పాలన పాటించాలని సూచించారు. స్విమ్మర్లు లైఫ్ బాయ్స్, జాకెట్స్ ధరించాలని గోదావరిలో ఏ ఒక్కరు మిస్ అయిన విధులకు ఇబ్బంది కలుగుతుందని అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో దేవాదాయశాఖ డైరెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ రవి అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## స్వయం ఉపాధితో మహిళల ఆర్థిక బలోపేతం
## ప్రభుత్వ శిక్షణలు, పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

### ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**తిమ్మాపూర్** ప్రభుత్వం అందజేస్తున్న శిక్షణలు, పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. తిమ్మాపూర్ ఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి దేశ్ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో 20 మంది మహిళలకు ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్ లో గత నెల 12 నుండి ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సాధికారథ లక్ష్యంగా, వారు ఆర్థికంగా బలోపేతం కావాలన్న ఉద్దేశంతో విభిన్నంగా ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్ లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ ఆటోలను పైసా ఖర్చు లేకుండా నడుపుకోవచ్చని, తద్వారా రోజు వారి ఆదాయం సంపాదించవచ్చని అన్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను ఆటోల్లో తీసుకెళ్లడం ద్వారా మహిళలు నికర ఆదాయం పొందవచ్చని సూచించారు. జీవన ప్రమాణానికి, పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా సంపాదించడం అవసరమైన ఈ రోజుల్లో స్వయం ఉపాధి మహిళలకు ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. మహిళ ఆటో డ్రైవర్లు నిర్దిష్ట గమ్యాన్ని సురక్షితంగా చేరుస్తారని తెలిపారు. ఇదివరకే కరీంనగర్లో ఎన్నో సంవత్సరాలుగా ఆటో డ్రైవింగ్ వృత్తిలో రాణిస్తున్న పలువురు మహిళా ఆటో డ్రైవర్లు ప్రజల నుండి ప్రశంసలు అందుకుంటున్నారని తెలిపారు. శిక్షణ విజయవంతంగా పూర్తి అయిన తర్వాత మహిళలు ఆటోలు కొనుగోలు చేసేందుకు రుణ సదుపాయం కల్పించే ఏర్పాట్లు చేస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని బృందాలకు ఎలక్ట్రికల్ ఆటో రంగంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ గా మహిళలు రాణిస్తూ తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలని, డ్రైవింగ్ రంగంలోకి మరింత మంది మహిళలను ఆకర్షించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవింగ్ రంగంలో రాణిస్తున్న మహిళలు వారి అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళ డ్రైవర్లు ఆటో నడుపుతుండగా జిల్లా కలెక్టర్ ప్రయాణించారు. మహిళా ఆటో డ్రైవర్ల శిక్షణకు సహకరించిన బజాజ్ బృందాన్ని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ సుధారాణి, రాజ కిషన్ రెడ్డి, బజాజ్ కంపెనీ మేనేజర్లు అనిల్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

# 'వర్జిన్ బాయ్స్ టీజర్ '

### - యూత్‌ఫుల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్!
### - 'వర్జిన్ బాయ్స్' టీజర్ రిలీజై, యూత్‌లో హాట్ టాపిక్‌గా మారింది!

గీతానంద్, మిత్రా శర్మ హీరో హీరోయిన్లుగా, శ్రీహాన్, రోనీత్, జెన్నిఫర్, అన్షుల, సుజిత్ కుమార్, అభిలాష్‌లతో రూపొందిన ఈ రొమాంటిక్ కామెడీ, దయానంద్ దర్శకత్వంలో రాజా దరపునేని నిర్మాణంలో రాజ్‌గురు ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కింది. తాజాగా విడుదల అయిన టీజర్‌లో యూత్‌ఫుల్ వైబ్స్, కలర్‌ఫుల్ విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి.స్మరణ్ సాయి సంగీతం టీజర్‌కు జోష్‌ని జోడించగా, వెంకట ప్రసాద్ సినిమాటోగ్రఫీ ఫ్రెష్‌గా, ఎనర్జిటిక్‌గా కనిపిస్తోంది. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్ టీజర్‌ను క్రిస్పీగా మలిచింది. టీజర్‌లో గీతానంద్, మిత్రా శర్మ కెమిస్ట్రీ ఆకట్టుకుంటుంది.

హాస్యం, రొమాన్స్, ఎమోషన్స్‌తో కూడిన ఈ కథ, ఆధునిక రిలేషన్‌షిప్స్‌ను తమదైన స్టైల్‌లో చూపించనుందని తెలుస్తోంది. బిగ్ బాస్ ఫేమ్ శ్రీహన్ క్యారెక్టర్ ఒ కామెడీ టైమింగ్ కి రెస్పాన్స్ బాగా వస్తుంది. చిత్రంలో శ్రీహన్ నుండి మరింత కామెడీని ఆశించవచ్చు అనిపిస్తుంది. టీజర్‌లోని డైలాగ్స్, సీన్స్ ఫన్ ఎలిమెంట్స్‌ను హైలైట్ చేస్తున్నాయి. ఈ సమ్మర్‌లో 'వర్జిన్ బాయ్స్' యూత్‌ను థియేటర్స్‌కు రప్పించే ఫుల్ ఎంటర్‌టైనర్‌గా కనిపిస్తోంది. ఈ సినిమా కచ్చితంగా యూత్ కి బాగా కనెక్ట్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు.నిర్మాత రాజా దరపునేని మాట్లాడుతూ.. "ఈ సినిమా యూత్ కి కనెక్ట్ అయ్యేలా తీర్చిదిద్దాం అన్నారు. గతంలో ఎన్నో మంచి యూత్ ఫుల్ ఎంటర్టైనర్ లు వచ్చాయి.

కానీ వాటిని మైమరిపించేలా ఈ సినిమా ఉంటుందని అన్నారు. రొటీన్ కి భిన్నంగా ఈ సినిమా ఉంటుందన్నారు.ఈ సినిమా కచ్చితంగా యూత్ కి బాగా కనెక్ట్ అవుతుందని భావిస్తున్నాను" అన్నారు.ఆర్టిస్టులు : గీతానంద్, మిత్రా శర్మ, శ్రీహన్, రోనీత్, జెన్నీఫర్, అన్షుల, సుజిత్ కుమార్, బబ్లు, అభిలాష్

# వైసీపీకి షాక్ మీద షాక్

**విజయవాడ :** వైసీపీకి బుధవారం వరుస షాకులు తగిలాయి. బుధవారం ఉదయం శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానం వైసీపీ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేశారు. అనంతరం ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరారు జకియా ఖానం. ఇక చీరాల మున్సిపల్ ఛైర్మన్ పదవిని కూడా వైసీపీ కోల్పోయింది. చీరాల మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అయితే అంతకుముందే ఆయన మున్సిపల్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. మరోవైపు జంజనం శ్రీనివాసరావు ఇప్పటికే టీడీపీలో చేరారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బుధవారం వరుస షాకులు తగిలింది. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం.. చాలా మంది నేతలు వైసీపీకి రాజీనామా చేశారు. విజయసాయిరెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను, అవంతి శ్రీనివాస్ వంటి నేతలతో పాటుగా.. ద్వితీయ శ్రేణి నేతలు సైతం వైసీపీకి గుడ్‌బై చెప్పారు.

వీరిలో కొంతమంది కూటమి పార్టీల్లో చేరగా.. మరికొంతమంది క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. స్థానిక సంస్థల్లో వైసీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కూడా చాలా మంది వైసీపీని వీడారు. టీడీపీ, జనసేన పార్టీల్లో చేరటంతో గుంటూరు, విశాఖపట్నం వంటి మేయర్ పదవులను, చాలా చోట్ల మున్సిపాలిటీ ఛైర్మన్ పదవులను కూటమి పార్టీలు కైవసం చేసుకున్నాయి.ఇక ఆరుగురు ఎమ్మెల్సీలు కూడా వైసీపీకి రాజీనామా చేశారు. ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్సీ తమ పదవులకు రాజీనామా చేయగా.. బుధవారం ఏపీ శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానం కూడా వైసీపీకి రాజీనామా చేశారు. వైసీపీ సభ్యత్వంతో పాటుగా ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేస్తూ జకియా ఖానం మండలి ఛైర్మన్‌కు లేఖ రాశారు. జకియా ఖానం 2020 జులైలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. గవర్నర్ కోటాలో ఆమె ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అనంతరం జకియా ఖానం బీజేపీలో చేరారు. అయితే జకియా ఖానం రాజీనామా మరువక ముందే మరో నేత వైసీపీకీ, మున్సిపల్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

బాపట్ల జిల్లా చీరాల మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు మున్సిపల్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. జంజనం శ్రీనివాసరావు ఇప్పటికే వైసీపీని వీడి టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. అయిత శ్రీనివాసరావుపై అవిశ్వాస తీర్మానం పెట్టడంతో జంజనం శ్రీనివాసరావు మున్సిపల్ ఛైర్మన్ పదవికి ముందుగానే రాజీనామా చేశారు. అవిశ్వాస తీర్మానానికి హాజరవ్వడానికి ముందు చీరాల మున్సిపల్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు జంజనం శ్రీనివాసరావు ప్రకటించారు.అనంతరం చీరాల మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావుపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. టీడీపీ కౌన్సిలర్లకు మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గం కౌన్సిలర్లు మద్దతు తెలపడంతో బుధవారం పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది అవిశ్వాసానికి అనుకూలంగా 26 ఓట్లు పడ్డాయి. మరోవైపు కౌన్సిలర్లతోపాటు ఎక్స్ అఫిసియో సభ్యుల హోదాలో చీరాల ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ తేనేటి కృష్ణ ప్రసాద్ ఓట్లు వేశారు. తీర్మానం నెగ్గడానికి అవసరమైన దానికంటే మూడు ఓట్లు అదనంగా వచ్చాయి

# మచిలీపట్టణానికి ఆపరేషన్ సింధూర్‌తో బంధం

**విజయవాడ :** మన సైన్యం చూపిస్తున్న తెగువ, దూకుడు, ధైర్యం ప్రపంచ దేశాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. అయితే ఉగ్రవాద దేశంపై సాగుతున్న యుద్ధంలో భారత్ డ్రోన్లను కనివిని ఎరుగని రేంజ్ లో వాడింది. ఉగ్రవాద దేశం సైతం అదే స్థాయిలో మనమీదికి ప్రయోగిస్తే.. వాటిని బిఇఎల్ డెవలప్ చేసిన డి-4 వ్యవస్థ నేల కూల్చింది. వాస్తవానికి కొన్ని సంవత్సరాల క్రితం యుద్ధం అంటే విమానాలు ఎక్కువగా కనిపించేవి. ట్యాంకులు ఎక్కువగా దర్శనమిచ్చేవి. శతఘ్నులు, యుద్ధనౌకలు యుద్ధక్షేత్రంలో ఎక్కువగా కనిపించేవి.. అయితే ఉక్రెయిన్ ? రష్యా మధ్య జరిగిన పోరు తర్వాత డ్రోన్ల వాడకం అధికమైపోయింది. ఇక ప్రస్తుతం ఉగ్రవాద దేశంతో మనం సాగిస్తున్న పోరులో డ్రోన్ల వాడకం కానీ విని ఎరుగనిస్తాయికి పెరిగిపోయింది.. అటు ఉగ్రవాద దేశం నుంచి కూడా డ్రోన్లు భారీగానే వస్తున్నాయి. ఇక ఎగిరే బాంబులకైతే లెక్కలేదు. ఇక ఇదే సమయంలో ఉగ్రవాద దేశం మన పైకి సంధిస్తున్న డ్రోన్లను తిప్పికొట్టే ఎయిర్ డిఫెన్స్ ను భారత్ డెవలప్ చేసుకుంది. ఉగ్రవాద దేశం చైనా మీద, తుర్కియే మీద విపరీతంగా డిపెండ్ అయింది. అక్కడినుంచి డ్రోన్స్ ఇంపోర్ట్ చేసుకుంది. అయితే వాటిని పడగొట్టడంలో మన డిఫెన్స్ అదరగొట్టింది. వీటిని నేల నాకించేలా చేయడంలో ఎస్ 400, ఆకాష్ వంటి మిసైల్స్ కీ రోల్ ప్లే చేశాయి. ఇక వీటితోపాటు భారత్ ఎలక్ట్రోనిక్స్ లిమిటెడ్ డెవలప్ చేసిన డీ4 వంటి వ్యవస్థ కూడా మేజర్ రోల్ ప్లే చేసింది. డీ 4 అంటే డ్రోన్, డిటెక్షన్, డెటర్, డెస్ట్రాయ్.. ఇందులో ప్రధానంగా రాడార్లు ఉంటాయి. లేజర్లు కూడా ఇమిడి ఉంటాయి. ఎలక్ట్రో ఆప్టికల్ వ్యవస్థలు ప్రధాన పాత్ర పోషిస్తుంటాయి. మన దేశానికి చెందిన డిఫెన్స్ రీసెర్చ్, డెవలప్ సెంటర్ వీటిని అభివృద్ధి చేసింది.

అయితే ఎక్కువ సంఖ్యలో మ్యానుఫ్యాక్చర్ చేసే బాధ్యతను భారత్ ఎలక్ట్రోనిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) భుజాలకు ఎత్తుకుంది. మ్యానుఫ్యాక్చరింగ్ స్టేజిలో బిఈఎల్ లోనే డ్రోన్లకు మళ్లీ ఫైనల్ టచింగ్ అందుతుంది. డి 4 వ్యవస్థలకు ఉపయోగపడే రాడార్లు బెంగళూరు యూనిట్ లో తయారవుతున్నాయి. జామర్లు హైదరాబాదులో రూపుదిద్దుకుంటున్నాయి. ఆ తర్వాత అవి ఆంధ్రప్రదేశ్ లోని మచిలీపట్నం వెళ్తున్నాయి. మచిలీపట్నం యూనిట్ ఎలక్ట్రో ఆప్టిక్ డివైస్ ను తయారు చేస్తోంది. వాటికి రాడార్లు, జామర్లు కస్టమర్ చేసి డీ 4 వ్యవస్థకు ఫైనల్ టచ్ ఇస్తోంది. మొత్తంగా ఆపరేషన్ సిందూర్ లో బందరు కూడా తనవంతు పాత్ర పోషించింది. ఇక్కడే అధునాతనమైన డీ4 వ్యవస్థ డెవలప్ అవుతోంది. "ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం గొప్ప విషయం. అయితే ఇందులో బందరు ప్రాంతానికి పాత్ర ఉండటం మరింత గర్వకారణం దీనిని గొప్పగా భావిస్తున్నామని" బందరు ప్రాంత ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

# పెద్దిరెడ్డికి తప్పని తిప్పలు

**తిరుపతి** వైసీపీ సీనియర్ నేత, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం భూముల వ్యవహారంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు ఇచ్చారు. అటవీ, ప్రభుత్వ, బుగ్గ మఠం భూముల ఆక్రమణ వ్యవహారంలో మాజీమంత్రి పెద్దిరెడ్డి కుటుంబసభ్యులపై కేసులు నమోదు చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. అలాగే ఈ భూములను రక్షించలేని అధికారులపైనా చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశాలిచ్చారు. భూముల ఆక్రమణలపై విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డీజీ ఇచ్చిన నివేదికను పవన్ కల్యాణ్ పరిశీలించారు. డీజీ సిఫార్సులకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు.చిత్తూరు జిల్లాలో అటవీ, ప్రభుత్వ, బుగ్గ మఠం భూముల ఆక్రమణలపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డీజీ విచారణ జరిపి పవన్ కల్యాణ్ కు నివేదిక ఇచ్చారు. పెద్దిరెడ్డి భూముల వ్యహారంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ నివేదికను పవన్ పరిశీలించారు. అటవీ భూముల ఆక్రమణలకు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు.పెద్దిరెడ్డి కుటుంబం అటవీ భూములు ఆక్రమించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రభుత్వం చేపట్టిన విచారణలోనూ ఇదే తేలిందని సమాచారం. ఈ వ్యవహారంలో పెద్దిరెడ్డి కుటుంబీకులపై ప్రభుత్వం క్రిమినల్ చర్యలు తీసుకునే ఛాన్స్ ఉంది. అదే సమయంలో భూములు ఆక్రమణలకు గురవుతుంటే రక్షించ లేని వారిని బాధ్యులను చేయనున్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోనుంది ప్రభుత్వం. అదే విధంగా ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నివేదికలో సిఫార్సు చేశారు. దాంతో పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదయ్యే ఛాన్స్ ఉంది.మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం చిత్తూరు జిల్లాలో అటవీ, ప్రభుత్వ, బుగ్గ మఠం భూముల ఆక్రమించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌ను ప్రభుత్వం ఆదేశించింది. విచారణ జరిపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ.. మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు నివేదిక అందజేశారు.

# కింగ్‌కు దక్కని మర్యాద

**హైదరాబాద్ :** తెలంగాణలో మిస్ వలర్డ్ 2025 పోటీలు గ్రాండ్ గా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రారంభమైన ఈవెంట్‌లో రోజుకో కార్యక్రమం జరుగుతోంది. అందాల పోటీలకు విచ్చేసిన వివిధ దేశాల భామలు చార్మినార్‌ను సందర్శించిన అనంతరం చౌమహల్లా ప్యాలెస్‌లో నిర్వహించిన విందుకు హాజరయ్యారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణులకు ఇచ్చిన డిన్నర్‌కు రేవంత్ రెడ్డి తన సతీమణి గీతతో కలిసి హాజరయ్యారు. వారితోపాటు హీరో అక్కినేని నాగార్జున కూడా వచ్చారు.టేబుల్ వద్దకు చేరుకున్న వీరు పరస్పరం పలకరించుకోలేదు. నాగార్జున నమస్కరిస్తూ షేక్ హ్యాండ్ ఇవ్వబోగా రేవంత్ రెడ్డి స్పందించలేదు. పక్కనే ఉన్న అతడి సతీమణి గీత పలకరించారు. నాగార్జునతో పలకరించకుండా అక్కడకు హాజరైన మిగతా వారితో రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆ తర్వాత కొన్ని నిమిషాల పాటు రేవంత్, నాగార్జున ఒకే టేబుల్ వద్ద కూర్చున్నా కూడా పరస్పరం పలకరించుకోలేదు. అతడు పలకరించకపోవడంతో నాగార్జున ఇటు తిరిగి కూర్చున్నారు. కార్యక్రమం ఆసాంతం వీక్షించారు. ఈ వ్యవహారమంతా కెమెరా కంటికి చిక్కింది. ఆ వీడియో వైరల్‌గా మారింది.ఈ స్థాయిలో వివాదం కావడం వెనుక కొన్ని నెలల కిందట జరిగిన పరిణామాలు కారణంగా తెలుస్తున్నాయి. నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను గతంలో హైడ్రా కూల్చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నాగార్జున కుమారుడు హీరో నాగచైతన్య విడాకుల అంశంలో కొండా సురేఖ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా సంచలనం రేపాయి. వరుస పరిణామాలతో నాగార్జున కుటుంబం రేవంత్ రెడ్డిపై ఆగ్రహంతో ఉందని తెలుస్తోంది. గతంలో కూడా రేవంత్ రెడ్డి, నాగార్జున ఎదురుపడినా ఇదే సీన్ కనిపించింది. సినీ ప్రముఖులతో భేటీ సందర్భంగా నాగార్జున పాల్గొన్నా రేవంత్‌రెడ్డి పట్టించుకోలేదు. రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే సినీ పరిశ్రమతో సఖ్యత ఉండడం లేదని తెలుస్తోంది. తనకు వ్యతిరేకంగా వెళ్లే వారిని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. అందులో భాగంగానే పాన్ ఇండియా స్టార్‌ను ఒక రోజు జైలుకు పంపించిన వైనాన్ని గుర్తుచేసుకుంటున్నారు. సినీ పరిశ్రమతో ప్రభుత్వ వైరం సరికాదని పలువురు చెబుతున్నారు.

## జనసేన కార్యకర్తకు
# టీడీపీ ఎమ్మెల్యే అండ

**కాకినాడ :** జనసేన పార్టీ కార్యకర్తకు కష్టం వస్తే.. టీడీపీ ఎమ్మెల్యే అండగా నిలబడ్డారు.. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి మరీ సాయం కోరారు. స్వయంగా ఎమ్మెల్యే వచ్చి రిక్వెస్ట్ చేయడంతో సీఎం కూడా వెంటనే సాయం అందించారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త రమేష్ భార్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె వైద్యం కోసం చాలా డబ్బులు ఖర్చు చేశారు.. అయితే వైద్యులు ఆమెకు కిడ్నీ మార్చిడి చేయాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులతో వారికి ఆ సర్జరీ భారంగా మారింది. వెంటనే స్థానిక జనసేన పార్టీ నేతలు ఈ విషయాన్ని గోపాలపురం టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు.. ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సాయం అందేలా చూశారు.గోపాలపురం నియోజకవర్గానికి చెందిన ఒక సామాన్యమైన పేద కుటుంబానికి చెందిన ఉన్నమట్ల రమేష్‌కు జనసేన పార్టీపై అభిమానం.

గత ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం పనిచేశారు. అయితే కొంతకాలంగా రమేష్ భార్యకు కిడ్నీ సమస్య వలన.. వైద్యులు కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయాలని సూచించారు. రెక్కాడితే గానీ, డొక్కాడని కుటుంబం ఆపరేషన్ కు అన్ని లక్షలు వెచ్చించి వైద్యం చేయించుకోలేని పరిస్థితి. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు, జనసేన నేతలు, కార్యకర్తలు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు గారి దృష్టికి తీసుకువెళ్లి ఆదుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుండి సహాయం అందేలా చూస్తానన్నారు. వీరు ఒూఅకి అప్లై చేసుకోగా రూ.2,00,000 లక్షలు మంజూరు చేశారు.

కానీ రమేష్ భార్య ఆపరేషన్‌కు ఆ డబ్బులు సరిపోలేదుఅ వెంటనే ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు స్వయంగా సీఎంఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడగా.. వారు రూ. 3,60,000 మంజూరు చవేశారు. కానీ నిరుపేద కుటుంబం ఇప్పటికే వైద్య ఖర్చుల నిమిత్తం అంత అయ్యిపోయింది ఆర్థికంగా చితికిపోయారు. తమ దగ్గర ఆపరేషన్‌కు సరిపడా డబ్బులు లేవని.. మళ్లీ ఎమ్మెల్యేను కలిసి సాయం కోరారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు జనసేన పార్టీ కార్యకర్త రమేష్ కుటుంబానికి అండగా నిలిచి.. ఆయనే స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి రూ. 6,30,000/- లక్షలు చెక్కును మంజూరు చేయించి.. ఇంకా ఆపరేషన్ కి అవసరమైతే సొంత డబ్బును కూడా ఇస్తా అని హామీ ఇచ్చారు. మద్దిపాటు వెంకట రాజు చేసిన సాయం గురించి టీడీపీ కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా షేర్ చేయడంతో వైరల్ అవుతోంది. గోపాలపురం ఎమ్మెల్యే పెద్ద మనసును అందరూ అభినందిస్తున్నారు.

# ఫడ్నవిస్‌ను కలిసిన రోహిత్

**ముంబై :** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కలిశాడు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత రోహిత్ ఇలా మహారాష్ట్ర సీఎంను కలవడంపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కొంపదీసి హిట్‌మ్యాన్ బీజేపీలో చేరి పొలిటికల్ ఎంట్రీ ఇవ్వడం లేదు కదా అంటూ నెటిజన్లు పోస్టులు చేస్తున్నారు.ముంబైలోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను రోహిత్ శర్మ బుధవారం కలుసుకున్నాడు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, రోహిత్ శర్మ కాసేపు భేటీ అయ్యారు. దీనికి సంబంధించిన ఫొటోలను సీఎం ఫడ్నవీస్ నేరుగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దాంతో పాటు రోహిత్ శర్మ నూతన అధ్యాయంలో విజయం సాధించాలని కోరుకుంటున్నా అంటూ పేర్కొన్నారు"నా అధికారిక నివాసమైన వర్షలో రోహిత్ శర్మను కలుసుకోవడం, మాట్లాడటం చాలా సంతోషాన్ని ఇచ్చింది. టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ పలికిన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపాను. తన నూతన అధ్యాయంలో సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను" అని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. రిటైర్మెంట్ తర్వాత రోహిత్ శర్మ ఇలా మహారాష్ట్ర సీఎంను కలవడం పలు ఊహాగానాలకు దారి తీస్తోంది. కెరీర్‌కు గుడ్ బై చెప్పిన తర్వాత ఎంతోమంది క్రికెటర్లు రాజకీయాల్లో చేరారు. ప్రస్తుత టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా బీజేపీలో చేరి ఎంపీగా గెలిచాడు. ఆ బాటలోనే ఇప్పుడు రోహిత్ శర్మ వెళ్తున్నాడని అనుకుంటున్నారు. కానీ రోహిత్ శర్మ టీ20, టెస్టులకు మాత్రమే రిటైర్మెంట్ ఇవ్వగా.. వన్డే క్రికెట్‌లో ఇంకా కొనసాగుతున్నాడు.2013లో టెస్టు క్రికెట్‌లో అడుగుపెట్టిన రోహిత్ శర్మ 2025 వరకూ కొనసాగాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు కొద్ది రోజుల ముందే తన రిటైర్మెంట్‌ను ప్రకటించాడు. ఓవరాల్‌గా టీమిండియా తరఫున 67 టెస్టు మ్యాచ్‌లు ఆడిన హిట్ మ్యాన్ 4301 పరుగులు చేశాడు. 40.57 యావరేజ్‌తో 12 సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు.

# డ్రైనేజీ సంపులో మృతదేహం

**సికింద్రాబాద్ :** మహంకాళి పీఎస్ పరిధిలో డ్రైనేజీ సంపులో మృతదేహం లభ్యం అయింది. గ్రాండ్ మినర్వా హోటల్ డ్రైనేజి మ్యాన్ హోల్ లో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని డ్రైనేజీ సంపు నుండి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న మహంకాళి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైనేజీ సంపులో ఆ వ్యక్తి ప్రమాదవశాత్తు పడ్డాడా లేక మరేదైనా జరిగిందా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

## చిరు వ్యాపారాల షాపులను తొలగించిన అధికారులు

**నాగర్ కర్నూలు** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో రోడ్డు పక్కన చిరు వ్యాపారుల షాపులను అధికారులు కూల్చివేసారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న షాపులను కూల్చివేసారని వ్యాపారస్తులు ఆరోపించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి విదేశీ పర్యటనలో వున్నారు. పథకం ప్రకారమే ఎమ్మెల్యే వెళ్లాక షాపులు కూల్చివేసి, తమ పొట్ట కొడుతున్నారంటూ చిరు వ్యాపారుల ఆవేదన వ్యక్తం చేసారు.

# ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారులు మృతి

**కడప** కడప జిల్లాలో విషాదం అలుముకుంది. ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారులు మృతి చెందారు. బ్రహ్మంగారి మఠం మండలం మల్లేపల్లి చెరువులో ఈతకి దిగిన చిన్నారులు నీటిలో మునిగి మరణించారు. వేసవి సెలవులు కావడంతో ఐదుగురు విద్యార్థులు ఈతకు వెళ్లి గల్లంతయ్యారు. ఈతకు వెళ్లిన వారు ఎంతసేపూ తిరిగిరాకపోవడంతో సాయంత్రం వరకూ చూసిన తల్లిదండ్రులు తర్వాత వెదుకులాటను ప్రారంభించారు.అయితే బంధువుల ఇళ్లలోనూ లేకపోవడంతో సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి వెతకగా పిల్లల దుస్తులు కనిపించాయి. దీంతో ఐదుగురు చిన్నారులు మరణించినట్లు తెలిసిన కుటుంబసభ్యుల రోదన వర్ణనాతీతంగా ఉంది. గజ ఈతగాళ్లను పిలిపించి చెరువులో వెతికించిన తర్వాత ఐదుగురి మృతదేహాలు లభ్యమయినట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పిల్లర్ గుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

**మేడ్చల్** హైదరాబాద్ నగరంలో విషాదం చోటుచేసుకుంది. ఉప్పల్ భాగాయత్ దగ్గర నిర్మాణంలో ఉన్న ఓ భవన స్థలంలో పిల్లర్ కోసం తవ్విన గుంతలో పడి ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మృతి చెందిన బాలురు అర్జున్ , మణికంఠ గా గుర్తించారు. జోగులాంబ గద్వాల జిల్లా నుంచి కుటుంబంతోపాటు వలస వచ్చి ఉప్పల్‌లోని కుర్మానగర్‌లో నివాసం ఉంటున్నారు.చిన్నారుల తల్లిదండ్రులు అక్కడే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేసుకుంటే జీవనం కోనసాగిస్తున్నారు. ఇద్దరు చిన్నారులు మంగళవారం సాయంత్రం నుంచి కనిపించక పోవటం వలన పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కుటుంబసభ్యుల ఇచ్చిన ఫిర్యాదులో మిస్సింగ్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు రాత్రి నుండి గాలింపు చేపట్టగా బుధవారం ఉదయం భాగాయత్‌లో కుల సంఘాల భవన నిర్మాణానికి కేటాయించిన స్థలంలో తవ్విన పిల్లర్ గుంతలో అర్జున్, మణికంఠ మృతదేహాలు లభ్యమైంది.దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నా

# అగ్ని ప్రమాదంలో వాహనాలు దగ్గదం

**సికింద్రాబాద్** సికింద్రాబాద్ బోయిన్‌పల్లి పరిధిలో అగ్నిప్రమాదం జరిగింది. ఓ గ్యారేజీలో పాఠశాల బస్సుకు డెంటింగ్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగసిపడి పక్కనే ఉన్న లారీ, టాటా ఏస్ వాహనానికి వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా దగ్ధం కాగా.. లారీ, టాటా ఏస్ వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

# ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ మృతి

**ఏలూరు** ఏలూరు జిల్లా పోలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం చోటుచేసుకుంది.కుంకాల గ్రామానికి చెందిన గిరిజన మహిళ శిరీష ప్రసవం కోసం ఆసుపత్రిలో చేరింది. కొంతసేపటికే మహిళ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నర్సులు చికిత్స అందించడంతోనే శిరీష మృతి చెందిందని ఆమె భర్త ఆరోపిస్తున్నాడు. శిరీష మృతదేహంతో ఆసుపత్రి బయట ఘోరంగా విలపిస్తున్నాడు. దీనికి సంబంధించిన వీడియో నెటిజన్లను కంటతడి పెట్టిస్తోంది.

## స్టీల్ ప్లాంట్ ఎదుట అఖిల పక్ష

# కార్మిక సంఘాల అందోళన

**విశాఖపట్నం** విశాఖ స్టీల్ యాజమాన్యం క్రమ శిక్షణ పేరుతో స్టీల్ కార్మికుల పై సస్పెన్షన్, షో కాజ్ నోటీసులు తక్షణం ఎత్తివేయాలని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు యాజమాన్యం డిమాండ్ చేశారు.స్టీల్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఏఐటియుసి అధ్యక్షు లు కె ఎస్ ఎన్ రావు అధ్యక్షత వహించారు.ఈ ధర్నాను ఉద్దేశించి స్టీల్ సిఐటియు గౌరవ అధ్యక్షులు జె అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం క్రమశిక్షణ పేరుతో నియంతృత్వాన్ని ప్రదర్శిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కార్మికులను వారి హక్కులను కూడా కాలరాస్తూ నేడు యాజమాన్యం కార్మిక వర్గాన్ని తీవ్ర భయభ్రాంతు లోకి నెడుతోందని ఆయన వివరించారు. ఈ స్థితి కొనసాగదని యాజమాన్యం పునరాలోచించి తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవం

**- స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన**

**ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సతీమణి తులసిమ్మ**



**బద్వేలు** బద్వేలు నియోజకవర్గ పోరుమామిళ్ల రంగసముద్రం పంచాయతీలోని టీటీడీ కళ్యాణ మండపం సమీపంలో వెలిసిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ వారి దేవాలయ దేశము వార్షికోత్సవం పురస్కరించుకుని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వారి సతీమణి తులసిమ్మ పట్టు వస్త్రాలు సమర్పించారు అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ దంపతులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి , రంగసముద్రం వైస్ సర్పంచ్ రుద్రవరం ప్రసాద్ జగన్మోహన్ ఆచారి, శ్రీనివాసులు ఆచారి, బాలుడు ఆచారి, ఆలయ కమిటీ సభ్యులు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ! ఏమైందమ్మా ఇల్లు!

**- ఇందిరమ్మ గృహ నిర్మాణంలో ప్రభుత్వం మెలికలు లబ్ధిదారుల సంఖ్య లక్షలు**
**- అర్హులైన అభ్యర్థులు వందలు**
**వచ్చేది వర్షాకాలం - శిథిలావస్థలో ఇండ్లు**
**- పూరి గుడిసెలు ఏ పథకం చూసిన అంతే సంగతులు**
**- పలితం శూన్యము. బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూరు రవీందర్ ఆరోపణ**

**వనపర్తి** ప్రపంచంలోనే అతిపెద్ద భారతదేశం ప్రజాస్వామిక భారతదేశంలో అనేక రాష్ట్రాలు ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం లో భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించి 78 సంవత్సరాలు కాలం గడిచినా కూడా ఇప్పటికీ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు కూడు. గూడు. గుడ్డ. దిక్కు లేదు. ఏ ప్రభుత్వం వచ్చినా మాయ మాటలు గారడి కథలు చెప్పి ఓట్ల దండుకొని అధికారంలోకి రావడం తప్ప పేద ప్రజలకు కనీస అవసరాలలో ముఖ్యమైన గృహ నిర్మాణం సొంత ఇంటి కల నెరవేర్చలేకపోవడం మన దౌర్భాగ్యం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు 12 సంవత్సరాల కాలం అయినా కూడా గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు అత్యాశకే గురయ్యారు.ప్రస్తుతం సొంత ఇంటి కల నెరవేరుస్తామని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ గృహాలు నిర్మిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణానికి గుండు సున్నా చూపిస్తుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీనియర్ న్యాయవాది మున్నూరు రవీందర్ ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు కూడా పేద ప్రజలకు గృహ నిర్మాణాన్ని సొంత ఇంటి కల నెరవేర్చలేకపోవడంలో ఘోరంగా విఫలమైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశంలో కొన్ని లక్షల కోట్ల మంది పేద ప్రజలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద గృహ నిర్మాణం చేపడుతున్నాడని ప్రధానమంత్రి గృహ నిర్మాణం పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం విధులు మంజూరు చేస్తుందని అట్టి నిధులను అడ్డగోలుగా రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని ఆయన ఆరోపించారు. 2023 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటి స్థలం కలిగిన ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందని ఆ తర్వాత గృహ నిర్మాణ పథకానికి తూట్లు పొడుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన దరఖాస్తులలో దాదాపు 50 లక్షల దరఖాస్తులు ప్రజలు ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం చేతకాక ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ మొక్కుబడిగా గ్రామాలలో ఒక్కరు లేదా ఇద్దరికి మాత్రమే ఇల్లు మంజూరు చేస్తుందని అన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు మొదటి విడత లో ప్రతి మండలంలో కేవలం ఒక గ్రామం మాత్రమే ఎంపిక చేసి ఆ గ్రామంలో కూడా ఒకరిద్దరు లబ్ధిదారులకు ఇల్లు మంజూరు చేసిందని ఆయన అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఒకటి తర్వాత ప్రభుత్వం మాట మార్చిందని అన్నారు. ఎల్1. ఎల్ 2. ఎల్ 3. మూడు దశల్లో లబ్ధిదారులను ఎంపిక చేయడంలో అంతర్యం ఏముందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎల్ 1 కింద ఎంపికైన లబ్ధిదారులకు ఇప్పటివరకు బిల్లులు ఇవ్వకుండా నిర్మాణాలు చేయకుండా కాలయాపన చేస్తుందని ఆయన ఆరోపించారు. ఎల్ 1 కింద ఇంటి స్థలం కలిగిన ఇల్లు లేని లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అదేవిధంగా ఎల్ 2 కింద ఇల్లు ఇంటి స్థలం లేని లబ్ధిదారులను గుర్తించింది. అదేవిధంగా ఎల్ 3 లో పక్కా ఇల్లు కలిగిన లబ్ధిదారులు ఇంటి స్థలం కలిగిన లబ్ధిదారులు బ్యాంకుల్లో 50 వేల రుణం అప్పు ఉన్న లబ్ధిదారులు అదేవిధంగా ద్విచక్ర వాహనం రెండున్నర ఎకరాల భూమి ట్రాక్టర్. కార్లు కలిగిన లబ్ధిదారులను గుర్తించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఈ విషయం చెప్పకుండా ఎన్నికల తర్వాత దొంగ నాటకాలకు చెరలేపుతుందని బిజెపి నాయకుడు మున్నూరు రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ప్రతి నియోజకవర్గానికి తెలంగాణ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో ఒక్కొక్క నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు. ఎలాంటి కొర్రీలు కండిషన్లు లేకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయలేక ప్రజలలో వస్తున్న వ్యతిరేకతను గమనించి కేవలం మొక్కుబడిగా ఈ పథకాన్ని ఎక్కడో ఒకచోట కొంతమందికి మాత్రమే లబ్ధి చేకూరే విధంగా అమలు చేస్తుందని అన్నారు. అంతేకాక 400 చదరపు గజాల కంటే తక్కువ 600 చదరపు గజాల కంటే ఎక్కువ విస్తీర్ణం గల ఇంటి స్థలం ఉన్న లబ్ధిదారులు ఈ పథకానికి అర్హత లేదని కేవలం నిబంధనల ప్రకారం అర్హత ఉన్న లబ్ధిదారులకే ఇండ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం చెప్పడం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నది

# ఏసీబీకి చిక్కిన గ్రామ రెవెన్యూ కార్యదర్శి



**విజయనగరం :** విజయనగరం జిల్లా జామి మండలం అలమండ వీఆర్వో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. అలమండకు చెందిన మిడతాడ సూరీడమ్మ జామి తాసిల్దార్ కార్యాలయంలో తన భూమిని ఆన్ లైన్ లో మ్యుటేషన్ చేయుటకు దరఖాస్తు చేసుకుంది. దీంతో వీఆర్వో ఆర్నేపల్లి వేణు వారి నుండి రూ.15 వేలు లంచం డిమాండ్ చేయడంతో వారు ఏసీబీని ఆశ్రయించారు.మంగళవారం రాత్రి వీఆర్వో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు అధికారులు బుధవారం తెలిపారు.

## కడప ఫారెస్ట్ డివిజన్‌లో

# 9ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**- ఇద్దరు స్మగ్లర్లు అరెస్ట్ - ఒక మోటారు సైకిల్ స్వాధీనం**




కడప ఫారెస్ట్ డివిజన్ లోని సిద్దవటం రేంజ్ పరిధిలో 9ఎర్రచందనం దుంగలతో పాటు ఒక మోటారు సైకిల్ ను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లు ను అరెస్టు చేశారు. ఆర్ఐ చిరంజీవులు కు చెందిన ఆర్ఎస్ఐ ఎం. మురళీధరరెడ్డి టీమ్ సోమవారం సాయంత్రం సిద్దవటం ఫారెస్ట్ బీటు చేరుకుంది. అక్కడ నుంచి స్థానిక అటవీ అధికారులు పెంచల్ రెడ్డి, షేక్ జాఫర్, కె. రాజేష్ లతో కలసి నిత్యపూజ కోన వైపు కూంబింగ్ చేసుకుంటూ వెళ్లారు. మంగళవారం ఉదయం గొల్లపల్లి ఫారెస్ట్ సెక్షన్, ఎస్. రాజాంపేట సమీపంలో ఒక మోటారు సైకిల్ కనిపించింది. పోలీసులు అక్కడకు చేరుకునే సరికి అక్కడ ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని పట్టుకుని చుట్టుపక్కల పరిశీలించి చూడగా 9 ఎర్రచందనం దుంగలు లభించాయి. కడప జిల్లాకు చెందిన వారిని అరెస్టు చేసి ఎర్రచందనం దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి వారిని విచారించగా, ఎస్ ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హనుమాన్ ఆశీస్సులతో ప్రజలందరూ

# సుఖసంతోషాలతో జీవించాలి



**జయశంకర్ భూపాలపల్లి శ్రీరామ** భక్తుడు హనుమాన్ ఆశీస్సులతో ప్రజలందరూ అష్ట ఐశ్వర్యాలు, సుఖ సంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆకాంక్షించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీ 25 వ వార్డులో ఎర్రం అనూష- సతీష్ కుమార్ 21 సంవత్సరాల హనుమాన్ దీక్ష విజయవంతం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజ,బిక్ష కార్యక్రమంలో వేద పండితులు శ్రీ గోవర్ధన వెంకటాచార్యులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకోవడం ద్వారా మానవ విలువలు పెరుగుతాయని తెలిపారు. దీక్ష చేపట్టడం ద్వారా రుగ్మతలు తొలగడంతోపాటు ఎదుటివారికి సహకరించే మనస్తత్వం అలవాటు అవుతుందన్నారు. నియోజకవర్గ ప్రజల పై ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు. పూజా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని కొనియాడారు.హనుమాన్ దీక్ష స్వాములకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కు అనూష- సతీష్ కుమార్ కుటుంబ సభ్యులు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, సంస్థాగత ఎన్నికల జిల్లా పరిశీలకులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, టిపిసిసి సభ్యులు చెల్లూరి మధు, ఆర్టిఏ నెంబర్ సుంకరి రామచంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు ముత్యాల రాజయ్య, అప్పం కిషన్, అంబాల శ్రీనివాస్, యూత్ నాయకులు తోట రంజిత్, ఉడుత మహేందర్, లతోపాటు దీక్ష స్వాములు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ వారికి

# తప్పకుండా అవకాశాలు

**- పైరవీలతో పదవులు రావు.. అర్హతలు ఉన్న వారికే పదవులు..**
**- సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర**



**జయశంకర్ భూపాలపల్లి** కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారందరికీ తగిన గుర్తింపు లభిస్తుందని, పైరవీలతో పదవులు రావని, అర్హతలు ఉన్న వారికే పదవులు వస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం రేగొండ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఉమ్మడి రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య అధ్యక్షతన రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల నేతలతో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సంస్థాగత ఎన్నికల జిల్లా పరిశీలకులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, మాసంపెల్లి లింగాజి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయి నుండి పార్టీ నిర్మాణంలో సామాజిక న్యాయం పాటించడం ద్వారా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుద్దామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారని గుర్తుచేశారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణే.. కాంగ్రెస్ సిద్ధాంతమని ఈ సందర్భంగా తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ ప్రక్షాళనలో పీసీసీ పరిశీలకుల బాధ్యత అత్యంత కీలకమైందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు.పేద ప్రజలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందిపేద, నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. ఈరోజు రేగొండ మండల కేంద్రంలో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం అనంతరం రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 55 మందికి సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ.19,85,000 విలువ కలిగిన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ఆపదలో సీఎం సహాయనిధి ఆపద్బాంధులా ఆదుకుంటుందని తెలిపారు. మానవతా దృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలను ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వ అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గుర్తు చేశారు.రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలిభూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులను రైతులందరూ తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. రేగొండ మండలం జూబ్లీనగర్ గ్రామంలో ఏర్పాటుచేసిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులను రైతులందరూ తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గతంలో ఉన్న ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం గుర్తించి ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు మేధావులు, రైతు సంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం భూ భారతిని తీసుకు వచ్చిందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం సులువైన మరియు పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. భూ భారతి నూతన ఆర్ఓఆర్ రెవెన్యూ చట్టంపై పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలోనే ఒక్క రేగొండ మండలాన్ని ఎంపిక చేసి రైతుల నుండి సలహాలు, సూచనలు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ అన్ని కార్యక్రమాలల్లో ఎమ్మెల్యే వెంట వివిధ శాఖల అధికారులు, అన్ని గ్రామాల ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

## ఘనంగా సూర్య కళామందిరం నందు
## అన్నమయ్యచారులు 617వ జయంతోత్సవాలు



**కాకినాడ :** కాకినాడ సినిమా రోడ్డు సరస్వతీ గానసభ సూర్య కళామందిర్ నందు పొన్నాడ వెంకట కామేశ్వరమ్మ శ్రీఅన్నమయ్య వెల్ఫేర్ సొసైటీ వారి సౌజన్యంతో పొన్నాడ శ్రీనివాస్ నేతృత్వంలో సోమవారం మే 12వ తేదీన సాయంత్రం 6:30 కి వాగ్గేయకారుడు శ్రీ అన్నమయ్య చారులు 617వ జయంతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్వరభారతి సంగీత సరస్వతి గాన కళానిధి పెద్దాడ సూర్య కుమారి వారి బృందం చే అన్నమయ్య కీర్తనాలు నిర్వహించినారు. ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం కృష్ణవేణి లోకేష్ బృందం చే నృత్య కార్యక్రమం జరిపించి, కాకినాడ గాంధీనగర్ పార్క్ స్వరఅభిషేకం పీవీవీ వీరభద్రరావు బృందం చే మ్యూజికల్ నైట్ ఘనంగా నిర్వహించారు.

# పీవీని సొంతం చేసుకొనే పనిలో కమలం

### - గతేడాది భారత రత్న.. ఈ ఏడాది విగ్రహం

**హైదరాబాద్ :** దేశ రాజధానిలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి.ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలకే పీవీ విగ్రహం ఏర్పాటుకు లైన్ క్లియర్ కావడం చర్చనీయాంశంగా మారింది.జూన్ 28న పీవీ జయంతి. ఈలోగా తెలంగాణ భవన్ వద్ద పీవీ విగ్రహం ఏర్పాటుకు ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ అనుమతి ఇచ్చింది.అయితే, విగ్రహ ఏర్పాటుపై ఇప్పటివరకు తమకు ఎలాంటి సమాచారం లేదని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది.మార్చి 27వ తేదీన ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ సమావేశం జరిగింది. ఇందులో 'అదనపు వివరాలు' కింద న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్డీఎంసీ) పంపించిన ఆన్‌లైన్ దరఖాస్తుపై కమిషన్ చర్చించినట్లుగా మినిట్స్ లో ఉంది.ఇందులో పీవీ నరసింహారావు విగ్రహం తెలంగాణ భవన్ వద్ద ఏర్పాటు చేసేందుకు అనుమతించింది కమిషన్.చుట్టూ ఉన్న పచ్చదనం, ఫుట్‌పాత్‌లకు ఇబ్బంది లేకుండా చూడాలని స్పష్టం చేసింది.”రాత్రిళ్లు కూడా విగ్రహం స్పష్టంగా కనిపించేలా లైటింగ్ ఉండాలి. కాంతి కాలుష్యం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి” అని సమావేశం మినిట్స్ లో పేర్కొంది.ఢిల్లీలో పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటు చేస్తామంటూ పీవీ నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు 2024 ఏప్రిల్ 24న న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకుంది.”ఏపీ భవన్ లేదా తెలంగాణ భవన్ వద్ద కాంస్య విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి” అని కోరింది.ఇప్పటికే ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం ఉంది. ఇది ఏపీ భవన్ (కాంపౌండ్ వాల్) బయట ఫుట్‌పాత్ పక్కన ఉంది. టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పని చేశారు.ప్రకాశం పంతులు విగ్రహాన్ని 1992 నవంబరు 8న అప్పుడు ప్రధానిగా ఉన్న పీవీ నరసింహారావు ఆవిష్కరించారు.పీవీ నరసింహారావు విగ్రహ ఏర్పాటుకు ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ అనుమతించగా, కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంటుందని తెలంగాణ ప్రభుత్వ అధికారి ఒకరు బీబీసీతో చెప్పారు”పీవీ విగ్రహం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌ది కాదు. దీనిపై పాలకమండలి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది” అని కార్పొరేషన్ చైర్ పర్సన్ కేశవ్ చంద్ర చెప్పినట్లుగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రాసింది.”పీవీ విగ్రహం ఏర్పాటుపై తెలంగాణ ప్రభుత్వానికి ఇంకా ఎలాంటి అధికారిక సమాచారం లేదు” అని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి చెప్పారు.ఒకవేళ ప్రకాశం పంతులు విగ్రహం వద్ద పెట్టుకుంటే, అది ఏపీ లేదా తెలంగాణ భవన్ పరిధిలోకి రాదని చెప్పారాయన.ఢిల్లీ ఆర్ట్ కమిషన్ పీవీ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో, తెలంగాణ ప్రభుత్వం తరఫున విగ్రహం పెడతామంటే స్వాగతిస్తామని పీవీ నరసింహారావు మనవడు ఎన్వీ సుభాష్ చెప్పారు.ఢిల్లీలో పీవీ విగ్రహం ఏర్పాటుకు 2005 నుంచి ప్రతిపాదిస్తూ వచ్చినట్లు ఎన్వీ సుభాష్ చెప్పారు.'యూపీఏ ప్రభుత్వంలో అనుమతులు రాలేదు. పీవీకి భారతరత్న ఇచ్చాక మా కుటుంబం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైంది. ఆ సందర్భంలో కూడా పీవీ విగ్రహం ఏర్పాటు అంశం చర్చకు వచ్చింది” అని బీబీసీతో చెప్పారు ఎన్వీ సుభాష్.మొదటి నుంచి గాంధీ కుటుంబానికి విధేయుడిగా పీవీకీ గుర్తింపు ఉంది. 2004డిసెంబరులో గార్డియన్ పత్రిక దీనికి ఒక ఉదాహరణను తన కథనంలో పేర్కొంది.”1984లో ఇందిరా గాంధీ హత్య జరిగినప్పుడు ఆయన కేంద్ర హోం శాఖ మంత్రిగా ఉన్నారు. సాంకేతికంగా చూస్తే భద్రత వైఫల్యానికి బాధ్యులయ్యేవారు. కానీ, తర్వాత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ.. ఆయన్ను రక్షణ మంత్రిగా కేబినెట్ లోకి తీసుకున్నారు” అని గార్డియన్ పత్రిక కథనంలో పేర్కొంది.పీవీ మరణించినప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని యూపీఏ సంకీర్ణ కూటమి కేంద్రంలో అధికారంలో ఉంది.నాటి సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనూ కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంది.ప్రధానిగా పని చేసిన పీవీకి ఢిల్లీలో అంత్యక్రియలు నిర్వహించకుండా హైదరాబాద్ తరలించడం, భౌతిక కాయాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోకి అనుమతించకపోవడం, ఢిల్లీలో స్మారకం ఏర్పాటుచేయకపోవడంపైన అప్పట్లో విమర్శలు వచ్చాయి. సోనియాతో పీవీ నరసింహారావుతో సరైన సంబంధాలు ఉండేవి కావని, ఒకరి పట్ల మరొకరు అనుమానంతోనే ఉండేవారని కాంగ్రెస్ సీనియర్ నేత మార్గరెట్ అల్వా స్వీయ చరిత్రలో ప్రస్తావించారు. పీవీ ప్రభుత్వంలో ఆమె సిబ్బంది వ్యవహారాల మంత్రిగా పనిచేశారు.'కరేజ్ అండ్ కమిట్‌మెంట్' పేరుతో ఆమె రాసుకున్న ఆత్మకథలో సోనియా, పీవీలకు సంబంధించిన ఆసక్తికర అంశాలను వెల్లడించారు.“1992లో బోఫోర్స్ కేసులో పోలీసు ఫిర్యాదును కొట్టివేస్తూ ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. ఆ ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాలు చేయాలని పీవీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబ్రీ మసీదు ఘటన తర్వాత ఇద్దరి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం మొదలైంది” అని ఆ పుసక్తంలో మార్గరెట్ అల్వా పేర్కొన్నారు.2024 ఫిబ్రవరిలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించింది. పీవీ శత జయంతి ఉత్సవాలను తెలంగాణలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించింది.నెక్లెస్ రోడ్డులో పీవీ విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు నెక్లెస్ రోడ్డు పేరును 'పీవీ నరసింహారావు మార్గ్' అని పేరు మార్చింది.ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. గాంధీల కుటుంబంతో పీవీకి సత్సంబంధాలు లేవన్న వాదనలు ఉన్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పీవీ నరసింహారావు విగ్రహ ఏర్పాటు విషయంలో ఎలా వ్యవహరిస్తోందో చూడాల్సి ఉంది.”పీవీ తెలంగాణకు చెందిన వ్యక్తి. ఆయన విగ్రహం ఢిల్లీలో పెట్టాలనుకుంటే పెట్టుకోవచ్చు” అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు .అయితే, పీవీ విగ్రహం తెలంగాణ భవన్ వద్ద ఏర్పాటు చేసేందుకు ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ అనుమతించినా, విగ్రహ ఏర్పాటుకు స్థలం ఎక్కడనే విషయంపై స్పష్టత లేదు.ఆంధ్రప్రదేశ్ భవన్ ఉన్న ప్రాంతాన్ని విభజించి.. ఏపీ, తెలంగాణకు విడిగా భవనాలు నిర్మించనున్నారు.ఇప్పటికే ఉన్న ప్రకాశం పంతులు విగ్రహం పక్కన ఏర్పాటు చేస్తారా, మరో ప్రదేశం గుర్తిస్తారా, మరొకచోటైతే అది ఏపీ భవన్ నిర్మించే వైపు వస్తుందా లేదా తెలంగాణ భవన్ వైపు ఉంటుందా..అనే విషయంపైనా స్పష్టత రావాల్సి ఉంది.

# తెలంగాణ బాటలో ఆంధ్రా...

విజయవాడ, మే 14, (న్యూస్ పల్స్)

నాన్‌లోకల్ కోటా రిజర్వేషన్లపై తెలంగాణ బాటలో ఏపీ పయనిస్తోంది. ఇప్పటికే తెలంగాణలో 15శాతం నాన్ లోకల్ కోటాను తెలంగాణ స్థానికత కలిగిన వారికి పరిమితం చేయగా తాజాగా ఏపీలో కూడా అదే విధానాన్ని అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానికేతర కోటాకు కొత్త నిర్వచనాలపై స్పష్టత ఇచ్చింది.ఏపీలో 15శాతం నాన్ లోకల్ కోటా రిజర్వేషన్లను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయంతో ప్రొఫెషనల్ కోర్సులు, డిగ్రీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్య కోర్సుల్లో ప్రస్తుతం అమలవుతున్న 15% నాన్ లోకల్, జనరల్ కోటా సీట్లను ఇకపై పూర్తిగా ఏపీ వారికే కేటాయిస్తారు.2025-26 విద్యా సంవత్సరంలో నాన్ లోకల్ కోటా 15% సీట్లు ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన విద్యార్థులకే దక్కుతాయి. నాన్ లోకల్ సీట్లలో తెలంగాణకు చెందిన వారికి కూడా అవకాశం ఉండేది. ప్రభుత్వ ఉత్తర్వులతో తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల వారికి ఈ అవకాశం ఉండదు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఉన్నత విద్యలో ప్రొఫెషనల్ కోర్సుల్లో అడ్మిషన్లు, ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిబంధనల్లో స్థానిక, స్థానికేతర నిర్వచనాలను స్పష్టం చేస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ జీవో-20, 21, 22లను జారీ చేశారు. తెలంగాణలో స్థానికతపై ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్థానికులకే వర్తింప చేయాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో కన్వీనర్ కోటా సీట్లు 10%లో 85% సీట్లను స్థానికులకు కేటాయిస్తారు.

### రెండు రీజియన్ల పరిధిలో ప్రవేశాలు..

ఏపీలో స్థానికత రెండు రీజి యన్లుగా అమలు చేస్తారు. ఆంధ్ర యూనివర్శిటీ, శ్రీవేంకటేశ్వర వర్సిటీ రీజియన్లుగా స్థానికతను నిర్ణయి స్తారు. విభజన తర్వాత 10 ఏళ్లుగా ఏపీలో ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర, ఉస్మానియా రీజియన్లుగా సీట్ల భర్తీ చేసేవారు. తాజాగా ఉస్మానియా రీజియన్ ఏపీలో తొలగించారు. ఇకపై ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర రీజియన్ల వారీగా సీట్లను భర్తీ చేస్తారు.

### ఆంధ్ర రీజియన్‌లో ఈ జిల్లాలు..

ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు ఏయూ పరిధిలో ఉంటాయి. ఈ జిల్లాల్లో చదివే విద్యార్థులను ఏయూ రీజియన్ స్థానికులుగా పరిగణిస్తారు.

### శ్రీ వేంకటేశ్వర పరిధిలో జిల్లాలు...

ఉమ్మడి అనంతపురం, కర్నూలు, చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాలు ఎస్వీయూ పరిధిలో ఉంటాయి. ఈ జిల్లాల వారిని ఎస్వీ లోకల్‌గా పరిగణిస్తారు.స్థానికేతర, జనరల్ కోటా 15% సీట్ల కేటాయింపునకు కొన్ని నిబంధనలు విధించారు. ఆంధ్ర వర్సిటీ రీజియన్ అభ్యర్థులు.. శ్రీవేంకటే శ్వర రీజియన్‌లో 15% సీట్లకు పోటీ పడొచ్చు. శ్రీవేంకటేశ్వర రీజియన్ విద్యార్థులు.. ఆంధ్రా ప్రాంతంలో 15% స్థానికేతర సీట్లకు అర్హులవుతారు. ఉద్యోగ ఉపాధి కారణాల రీత్యా తల్లిదండ్రులు ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నా.. ఇద్దరిలో ఎవరైనా ఒకరు గతంలో పదేళ్ల పాటు ఏపీలో నివసించిన వారై ఉంటే వారి పిల్లలు ఈ కోటాలో పోటీ పడొచ్చు. అభ్యర్థి ఏపీలో కనీసం 10 ఏళ్లు నివసించి ఉండాలి. రాష్ట్రం బయట చదువుకున్న కాలాన్ని మినహాయించిన తర్వాత పదేళ్లు ఏపీలో నివాసం ఉండాలి.అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు గతంలో మాదిరిగానే రీజియన్ల వారీగా ఆరు నుంచి ఇంటర్మీడి యట్ చదువును ప్రామాణికంగా తీసుకుంటారు. బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ తదితర కోర్సులకు మొదట తొమ్మిదో తరగతి నుంచి ఇంట ర్మీడియట్ వరకు వరసగా నాలుగేళ్ల చదువును పరిగణలోకి తీసుకుంటారు.9 నుంచి ఇంటర్మీడియట్ వరకు వరసగా నాలుగేళ్లు ఆయా రీజియన్లలో చదవకపోయినా.. ఏడేళ్లలో నాలుగేళ్లు చదివి ఉండాలి. ఏడేళ్ల కాలంలో ఎక్కువ కాలం చదివిన ప్రాంతాన్ని వారి స్థానికతకు ప్రామాణికంగా తీసుకుంటారు.స్థానిక ప్రాంతంలో ఏ విద్యా సంస్థల్లోనూ నాలుగేళ్లు చదవకపోయినా.. అభ్యర్థి హాజరయ్యే అర్హత పరీక్షకు ముందు నాలుగేళ్లు ఏ ప్రాంతంలో నివాసం ఉంటే దాన్ని స్థానికతగా పరిగణిస్తారు. రెండు లేదా అంత కంటే ఎక్కువ ప్రాంతాల్లో చదివిన కాలం సమానంగా ఉంటే చివరిగా చదివిన ప్రాంతాన్ని స్థానికతగా తీసుకుంటారు. రాష్ట్రంలో ఏడేళ్లు ఏ విద్యాసంస్థల్లో చదవకపోయినా.. అర్హత పరీక్ష రాయక ముందు నుంచి ఏడేళ్ల పాటు ఏపీలో నివసించి ఉంటే స్థానిక అభ్యర్థులుగా లెక్కిస్తారు. ఏపీలో ఉన్న ఏడేళ్లలో ఎక్కడ ఎక్కువ కాలం నివసించి ఉంటారో అక్కడ స్థానికులుగా పరిగణనలోకి వస్తారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, విశ్వవిద్యాల యాలు, ఇతర అనుబంధ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యో గుల పిల్లలు ఏ రాష్ట్రానికి చెందిన వారైనా నాన్ లోకల్ సీట్లకు పోటీ పడొచ్చు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల జీవిత భాగస్వాములు కూడా నాన్‌లోకల్ కోటాకు అర్హులు అవుతారు. ఇతర రాష్ట్రాల వారు ఇక్కడ పనిచేస్తుంటే వారి భాగస్వామి భార్య లేదా భర్త స్థానికేతర కోటాకు దరఖాస్తు చేసుకోవచ్చు.

# భారత్, పాకిస్తాన్...
# వాణిజ్యం ఎవరికి లాస్

**న్యూఢిల్లీ :** భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తానే అపినట్లు అమెకా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుగా ప్రకటించారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని వెల్లడించారు. రెండు రోజుల తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య అణు యుద్ధాన్ని కూడా తానే ఆపినట్లు తెలిపారు. యుద్ధం ఆపకుంటే రెండు దేశాలతో వాణిజ్యం నిలిపివేస్తామని హెచ్చరించడంతో రెండు దేశాలు యుద్దం ఆపాయని మరో ప్రకటన చేశారు. దీంతో ఇప్పుడు దీనిపై భారత్ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అమెరికా భారత్ పాకిస్థాన్‌లతో వాణిజ్య సంబంధాలను పూర్తిగా నిలిపివేస్తే నష్టపోయేది ఎవరు, లాభ పడేది ఎవరు అన్న అంశాలపై చర్చలు జరుగుతున్నాయి.

### భారత్‌పై ప్రభావం

భారత్ అమెరికా మధ్య 2021?22లో ద్వైపాక్షిక వాణిజ్యం 119.42 బిలియన్ డాలర్లు దాటింది, ఇందులో 76.11 బిలియన్ డాలర్లు ఎగుమతులు, 43.31 బిలియన్ డాలర్ల దిగుమతులు. అమెరికా భారత్‌కు ప్రధాన ఎగుమతి గమ్యస్థానం, మొత్తం ఎగుమతుల్లో 18% వాటా కలిగి ఉంది.

### వాణిజ్యం ఆగిపోతే..

ఎగుమతి నష్టం: ఫార్మాస్యూటికల్స్, సాఫ్ట్‌వేర్ సేవలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్ వంటి రంగాలు భారీగా నష్టపోతాయి.
సేవల రంగం: భారత్ యొక్క ఐటీ మరియు బీపీవో సేవలు అమెరికా మార్కెట్‌పై ఎక్కువగా ఆధారపడతాయి. ౧ఊా, ఇన్ఫోసిస్ వంటి కంపెనీలు గణనీయమైన ఆదాయాన్ని కోల్పోవచ్చు.
వ్యూహాత్మక నష్టం: అమెరికాతో రక్షణ ఒప్పందాలు మరియు సాంకేతిక భాగస్వామ్యం (ఉదా., డిఫెన్స్ టెక్నాలజీ షేరింగ్) ఆగిపోవడం వల్ల భారత్ యొక్క రక్షణ సామర్థ్యాలు దెబ్బతినవచ్చు. పరోక్ష ప్రభావం: అమెరికా తన వాణిజ్య ఒప్పందాలను రద్దు చేస్తే, భారత్ ఇతర మార్కెట్ల (యూరోపియన్ యూనియన్, ఆసియా) వైపు మళ్లవచ్చు, కానీ ఈ పరివర్తనకు సమయం, వనరులు అవసరం. భారత్ ప్రత్యామ్నాయ మార్గాలు భారత్ యొక్క వైవిధ్యమైన ఎగుమతి మార్కెట్లు (యూరోప్, మధ్యప్రాచ్యం, ఆసియా), దేశీయ ఆర్థిక వృద్ధి ఈ నష్టాన్ని కొంతవరకు తగ్గించగలవు. అమెరికా విధించే టారిఫ్‌లను ఎదుర్కోవడానికి భారత్ ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్స్ వంటి రంగాలలో తక్కువ టారిఫ్‌లను ప్రతిపాదించవచ్చు. పాకిస్థాన్‌పై ప్రభావం పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ భారత్‌తో పోలిస్తే చిన్నది, అమెరికాపై ఎక్కువగా ఆధారపడుతుంది. అమెరికా పాకిస్థాన్‌కు ప్రధాన ఎగుమతి గమ్యస్థానం, ప్రధానంగా టెక్స్‌టైల్స్, కాటన్, లెదర్ ఉత్పత్తులు. **వాణిజ్యం ఆగిపోతే:** ఎగుమతి నష్టం: పాకిస్థాన్ యొక్క టెక్స్‌టైల్ రంగం, దాని ఆర్థిక వ్యవస్థలో 60% వాటా కలిగి ఉంది, తీవ్రంగా దెబ్బతింటుంది.
సైనిక సహాయం: అమెరికా నుండి సైనిక సహాయం (ఆయుధాలు, శిక్షణ) ఆగిపోతే, పాకిస్థాన్ యొక్క రక్షణ సామర్థ్యాలు బలహీనపడతాయి. ఇది భారత్‌తో సైనిక అసమానతను మరింత పెంచుతుంది.ఆర్థిక సంక్షోభం: పాకిస్థాన్ ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉంది, అమెరికా నుంచి ఆర్థిక సహాయం లేదా వాణిజ్యం ఆగిపోతే, దాని ఆర్థిక వ్యవస్థ మరింత క్షీణిస్తుంది. చైనా ఆధారం: పాకిస్థాన్ చైనా?పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ ద్వారా చైనాపై ఆధారపడవచ్చు, కానీ ఇది దీర్ఘకాల రుణ భారాన్ని పెంచుతుంది.
**రాజకీయ, వ్యూహాత్మక నష్టం..** అమెరికా సహాయం లేకుండా, పాకిస్థాన్ యొక్క భౌగోళిక రాజకీయ ప్రాముఖ్యత (ఆఫ్ఘనిస్థాన్, ఇరాన్ సరిహద్దులు) తగ్గవచ్చు. అమెరికా పాకిస్థాన్‌ను 'మేజర్ నాన్?నాటో అలై'గా గుర్తించినప్పటికీ, ఈ సంబంధం ఆగిపోతే, పాకిస్థాన్ అంతర్జాతీయంగా ఒంటరిగా మిగిలిపోవచ్చు.భారత్ నుండి ఫార్మాస్యూటికల్స్, ఐటీ సేవలు, పాకిస్థాన్ నుండి టెక్స్‌టైల్స్ వంటి దిగుమతులు ఆగిపోతే, అమెరికా సరఫరా గొలుసులు దెబ్బతింటాయి. ఉదాహరణకు, భారత్ నుంచి జనరిక్ ఔషధాలపై అమెరికా ఆధారపడుతుంది. వ్యూహాత్మక నష్టం: భారత్‌ను ఒక ముఖ్యమైన భాగస్వామిగా (ఇండో?పసిఫిక్ వ్యూహంలో చైనాకు కౌంటర్‌గా) కోల్పోవడం వల్ల అమెరికా, ఆసియా ప్రాంతంలో ప్రభావం తగ్గుతుంది. పాకిస్థాన్‌తో సంబంధాలు ఆగిపోతే, ఆఫ్ఘనిస్థాన్, మధ్య ఆసియాలో అమెరికా యొక్క గూఢచర్య సామర్థ్యాలు దెబ్బతినవచ్చు. ప్రపంచ వాణిజ్యం: అమెరికా ఈ రెండు దేశాలతో వాణిజ్యాన్ని ఆపితే, ఇతర దేశాలు (చైనా, రష్యా) ఈ శూన్యతను పూరించే అవకాశం ఉంది, దీనివల్ల అమెరికా ప్రపంచ ఆర్థిక ప్రభావం తగ్గవచ్చు.
**ఎవరికి ఎక్కువ నష్టం?** పాకిస్థాన్: దాని చిన్న ఆర్థిక వ్యవస్థ, అమెరికాపై ఎక్కువ ఆధారం, ఇప్పటికే ఉన్న ఆర్థిక సంక్షోభం కారణంగా పాకిస్థాన్ అత్యధిక నష్టాన్ని చవిచూస్తుంది. చైనా సహాయం ఉన్నప్పటికీ, దీర్ఘకాల రుణ భారం, సైనిక బలహీనత పాకిస్థాన్‌ను ఎక్కువ ప్రమాదంలోకి నెట్టవచ్చు.భారత్: భారత్ కూడా నష్టపోతుంది, కానీ దాని వైవిధ్యమైన ఆర్థిక వ్యవస్థ, ఇతర మార్కెట్లతో సంబంధాలు, దేశీయ ఉత్పత్తి సామర్థ్యం వల్ల ఈ నష్టాన్ని తట్టుకోగలదు.
అమెరికా: అమెరికా ఆర్థికంగా కొంత నష్టపోతుంది, కానీ దాని ప్రపంచ ఆర్థిక ఆధిపత్యం మరియు ఇతర భాగస్వాములతో సంబంధాలు ఈ ప్రభావాన్ని తగ్గిస్తాయి.

# ట్రాక్టర్, బొలెరో ఢీ..ఒకరు మృతి



**నల్గొండ** మాడుగులపల్లి మండల కేంద్రం శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ను బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా వుంది,. నలుగురికి గాయాలు అయ్యాయి. మృతుడు మిర్యాలగూడ (మం) రుద్రారం గ్రామానికి చెందిన రామయ్య గా గుర్తించారు

# తారకరాముడికే గులాబీ పగ్గాలు

**హైదరాబాద్ :** తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలలో భారత రాష్ట్ర సమితి ఒకటి. ఇది రెండు పర్యాయాలు తెలంగాణలో అధికారాన్ని చలాయించింది. ముఖ్యమంత్రిగా కేసీఆర్ రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించారు.. తెలంగాణ ముఖ్యమంత్రిగా మాత్రమే కాదు.. భారత రాష్ట్ర సమితి కి అధ్యక్షుడిగా కేసీఆర్ కొనసాగారు. అధికారం పోయిన తర్వాత కూడా ఆయన అదే స్థానంలోనే ఉన్నారు. ఇక ఆయన కుమారుడు కేటీఆర్ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. పేరుకు కార్యనిర్వాహక అధ్యక్షుడైనా సరే.. ఇప్పటికీ పార్టీలో పెత్తనం మొత్తం కేటీఆర్ దే. కొన్ని విషయాలు మినహా.. అన్నింటిలోనూ కేటీఆర్ దే పెత్తనం సాగుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఇటీవల కాలంలో భారత రాష్ట్ర సమితి పగ్గాలు కేటీఆర్ కు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. దీనిపై భారత రాష్ట్ర సమితి కీలక నాయకుడు కూడా ఎస్ అనే సమాధానమే చెబుతున్నారు. అయితే కెసిఆర్ కేటీఆర్ ను ఎప్పుడు పార్టీ ప్రెసిడెంట్ చేస్తారు? అనే ప్రశ్నకు మాత్రం ఇంతవరకు సమాధానం లభించడం లేదు.కేటీఆర్ ఒకవేళ పార్టీ ప్రెసిడెంట్ అయితే.. హరీష్ రావు పరిస్థితి ఏమిటి అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. అయితే దీనిపై స్వయంగా హరీష్ రావే క్లారిటీ ఇచ్చారు. భారత రాష్ట్ర సమితిలో కేటీఆర్ కంటే సీనియర్ నాయకుడు హరీష్ రావు. కేటీఆర్ కంటే కూడా మొదటి నుంచి ఆయన ఉద్యమంలో ఉన్నారు. అయితే ఎప్పుడైతే కేటీఆర్ భారత రాష్ట్ర సమితిలో చేరారో.. అప్పట్నుంచి హరీష్ రావుకు సమాంతర నాయకుడిగా ఎదగడం మొదలుపెట్టారు. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ కీలక శాఖలకు మంత్రిగారి పని చేశారు. ఒకరకంగా షాడో ముఖ్యమంత్రిగా ఉన్నారని ప్రచారం కూడా జరిగింది. అయితే అప్పట్లో అనేక సందర్భాల్లో పార్టీలో విభేదాలు చోటుచేసుకున్నాయని.. హరీష్ రావు వేరు కుంపటి పెడుతున్నారని ఆరోపణలు వినిపించాయి. అయితే దానిని హరీష్ రావు నిర్ద్వంద్వంగా కొట్టి పారేశారు. అయితే ఇప్పుడు మరోసారి హరీష్ రావు విలేకరులకు ముందుకు వచ్చి క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు..” కెసిఆర్ పార్టీ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఇబ్బంది లేదు. కేటీఆర్ ను అధ్యక్షుడిని చేస్తే నాకు వచ్చిన నష్టం లేదు. కెసిఆర్ మాటే నాకు శిరోధార్యం. పార్టీలో ఆయన ఎలాంటి పని చేయమన్నా నేను చేస్తాను. పార్టీలో విభేదాలు ఉన్నాయనేది అబద్ధం. ఇలాంటి ప్రచారం ఎప్పటినుంచో సాగుతోంది. ఇలాంటి ప్రచారాలను చూసుకుంటూనే అధికారంలోకి వచ్చాం. ఏకంగా రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించాం. ఇలాంటి వాటిని వినడం మాకు కొత్త కాదు. పార్టీ మొత్తానికి కెసిఆర్ బాస్. ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకున్నా పని చేయడానికి నేను సిద్ధమని” హరీష్ రావు స్పష్టం చేశారు. మొత్తంగా ఆయన పార్టీలో విభేదాలు లేవని స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ జరగాల్సిన ప్రచారం జరుగుతూనే ఉంది.

# సిటీలో ట్రాఫిక్ చెక్..

**హైదరాబాద్ :** బేగంపేట ఫ్లైఓవర్ వద్ద తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి బల్దియా రూ.14.6 కోట్లతో మరమ్మతులు చేపట్టనుంది. ఈ మేరకు టెండరు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అలాగే.. కంటోన్మెంట్‌లోని ఆర్.కె.పురం ఆర్వోబీ మరమ్మతులకు కూడా టెండరు నోటిఫికేషన్ జారీ చేయబడింది. ఈ రెండు పనులను ఏడాదిన్నరలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పనులు జరుగుతున్న సమయంలో వంతెనపై వాహనాల రాకపోకలు నిలిపివేయాల్సి ఉంటుంది.. కాబట్టి ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.బేగంపేట ఫ్లైఓవర్ వద్ద తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి.. బల్దియా రూ.14.6 కోట్లతో మరమ్మతులు చేపట్టనుంది. ఈ మేరకు ప్రాజెక్టుల విభాగం టెండరు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీంతోపాటు.. కంటోన్మెంట్‌లోని ఆర్.కె.పురం ఆర్వోబీ మరమ్మతులకు కూడా టెండరు నోటిఫికేషన్ జారీ చేయబడింది. ఈ రెండు పనులను ఏడాదిన్నరలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పనులు జరుగుతున్న సమయంలో వంతెనపై వాహనాల రాకపోకలు నిలిపివేయాల్సి ఉంటుంది.. కాబట్టి ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాల్సి వస్తుంది.బేగంపేట రైల్వే స్టేషన్ వద్ద ఈ ఫ్లైఓవర్‌కు 1980లో అప్పటి ముఖ్యమంత్రి టి. అంజయ్య శంకుస్థాపన చేశారు. ఇది మూడు సంవత్సరాలలో పూర్తయింది. సికింద్రాబాద్ , బేగంపేట మధ్య ప్రయాణ సౌలభ్యం పెరిగినప్పటికీ.. రద్దీ రోజురోజుకూ పెరగడంతో కొన్ని సంవత్సరాల తర్వాత పాత సీఎం క్యాంపు కార్యాలయం నుండి ఆర్వోబీని అనుసంధానం చేస్తూ మరొక వంతెనను నిర్మించారు. అయితే.. 40 సంవత్సరాల నాటి పిల్లర్ల మధ్య స్లాబుల అంచులు దెబ్బతినడం, స్లాబుల మధ్య దూరం పెరగడం .. పిల్లర్లపై బేరింగులు దెబ్బతినడంతో వంతెన ప్రమాదకరంగా మారింది. బేరింగులను మార్చి స్లాబులు.. గడ్డర్లను సరిచేస్తారు, అలాగే ఇంజెక్షన్ విధానంలో ఫైన్ సిమెంటును దెబ్బతిన్న కాంక్రీటు దిమ్మెల్లోకి పంపి మైక్రో కాంక్రీటింగ్‌తో పగుళ్లకు మరమ్మతులు చేస్తారు.బేగంపేట ఆర్వోబీ కింద రెండు నిరాశ్రయుల కేంద్రాలు ఉన్నాయి.. వాటిలో దాదాపు 200 మంది ఆశ్రయం పొందుతున్నారు. మరమ్మతుల సమయంలో వారిని ఇతర కేంద్రాలకు తరలించాలని కోరుతూ బల్దియా ఇంజనీర్లు అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యుసిడి) అధికారులకు లేఖ రాశారు. రెండేళ్లపాటు ఆ కేంద్రాలను ఇతర ప్రాంతాల్లో నిర్వహించడం లేదా పూర్తిగా తొలగించే మార్గాలను జిహెచ్ఎంసి పరిశీలిస్తోంది.ఈసిఐఎల్ , సైనిక్‌పురిని కంటోన్మెంట్‌తో కలిపే ఆర్.కె.పురం ఆర్వోబీ కూడా చాలా సంవత్సరాల క్రితం నిర్మించినదే. పగుళ్లు , స్లాబుల మధ్య దూరం పెరగడంతో వాహనాల రాకపోకలకు సమస్యగా మారింది. లాలాపేట, అడిక్‌మెట్ ఆర్వోబీల మాదిరిగానే ఆర్.కె.పురం ఆర్వోబీకి కూడా రూ.4.6 కోట్లతో మరమ్మతులు నిర్వహిస్తామని జిహెచ్ఎంసి అధికారులు తెలిపారు. ఈ మరమ్మత్తులు పూర్తయితే.. ఈ ప్రాంతాలలో వాహనాల రాకపోకలు సురక్షితంగా.. సజావుగా సాగుతాయని భావిస్తున్నారు.

# ఆత్మనిర్బర్ నిధి రుణాలకు బ్రేక్...

**మెదక్ :** పట్టణ ప్రాంతాలలో చిరు, వీధి వ్యాపారులకు అం దించే ప్రధానమంత్రి స్వనిధి (ఆత్మనిర్భర్ నిధి) రుణాల ప్రక్రియలో ప్రధాన భూమిక పోషించే సైట్ మూడు నెలలుగా పని చేయ డం లేదు. దీంతో స్వనిధి రుణాలు అందడంలేదు. తొలి, మలి దశ రుణాల కోసం ఎదురు చూస్తున్న వీధివ్యాపారులు కొంత నిరాశకు గురవుతున్నారు.మున్సిపాలిటీల్లో చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగించే వీధివ్యాపారులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వల్పకాలిక రుణాలను మంజూరు చేస్తుంది. 2020లో కరోనా లాక్ డౌన్ నుంచి ఆత్మనిర్బర్ నిధి పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద గుర్తించిన వీధి వ్యాపారులకు మొదటి విడతలో లబ్దిదారుడికి రూ.10 వేల రుణం అందజేశారు. ఈ మొత్తాన్ని బ్యాంకు ల ద్వారా నేరుగా లబ్దిదారుల ఖాతాలో జమ చేశారు. చిన్న వ్యాపారులకు ప్రభుత్వం అందజేసే ఈ మొత్తం వారి జీవనోపాధికి ఎంతగానో ఉపయోగపడేది. ఐదేళ్ల కిందట ప్రతి వీధి వ్యాపారికి రూ.10 వేలు ఖాతాలో జమ చేయగా ఈ మొత్తాన్ని ఏడాదిలోపు వడ్డీతో సహా బ్యాంకులకు చెల్లించిన వారికి మళ్లీ రుణం తీసుకోవడానికి వీలు కలిగేది. రెండో విడతలో రూ.20 వేలు అందించగా మూడో విడతలో దానిని రూ. 50 వేలకు పెంచారు. రుణం మొత్తం పెరుగుతూ ఉండ టం, వ్యాపారాభివృద్ధికి తోడుగా నిలవడంతో లబ్దిదారులు రుణం తీసుకోవడానికి మళ్లీమళ్లీ ఆసక్తి చూపుతున్నారు. బ్యాంకర్లు సైతం ఈ రుణాలు సక్రమంగా చెల్లించినవారికి అందించేందుకు ముందుకొ చ్చారు. అయితే గత మూడు నెలలుగా రుణాలు అందించడంలేదు. దీంతో వారు కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మనిర్భర్ నిధి పథకం కింద రుణాలు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని విధించి మరీ రుణాలు అందిస్తుండగా ఇటీవల కొత్త పథకం అమలు చేసేందుకు వీలుగా సాంకేతికపరంగా ఆప్షన్ ఇవ్వక పోవడంతో పాతవారితో పాటు కొత్త వారికి కూడా రుణాలు అందించేందుకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు తెలుస్తోంది.కొత్త పథకం అమలు చేసేంత వరకు పీఎం స్వనిధి పథకం నిలిచిపోయినట్లుగానే భావిస్తున్నారు. అయితే వీధి వ్యాపారులకు రూ. 50 వేల వరకు ఇస్తున్న రుణాన్ని చెల్లించిన వారికి దానిని రూ.లక్షకు పెంచాలని పలువురు కోరు తున్నారు.

# జిల్లాలో త్వరలో సాండ్ ట్యాక్స్ అమలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ట్రాక్టర్ యజమానులు పూర్తి వివరాలు కలెక్టరేట్లో నమోదు చేసుకోవాలి

వారం రోజుల్లోగా దరఖాస్తులు అందజేయాలి



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్)జిల్లాలో త్వరలో సాండ్ ట్యాక్స్ ద్వారా ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇసుక రవాణా పూర్తిగా త్వరలో ఆన్లైన్ చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని ట్రాక్టర్ అందరు యజమానులు, బాధ్యులు తమ వాహనాల లైసెన్స్, ఇతర అన్ని పత్రాలు, డ్రైవర్ వివరాలు డ్రైవింగ్ లైసెన్సు తదితర పత్రాలు.. అలాగే జిల్లా కలెక్టర్ పేరిట రూ. 10 వేల డీడీ తీయాలని తెలిపారు. ఆయా వివరాలు, పత్రాలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సీ సెక్షన్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వాహన యజమానులు, బాధ్యులు ఈ వివరాలన్నీ వారం రోజుల్లోగా అందజేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అనుమతి పొందిన సాండ్ రీచ్ ల నుంచి మాత్రమే ఇసుక రవాణా చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# బీరప్ప కళ్యాణ మహోత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్

వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ నియోజకవర్గం పరిధిలోని వేములవాడ రూరల్ మండలం, నమిలి గుండుపల్లి,బాలరాజ్ పల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న శ్రీ బీరప్ప కామరతి స్వామివార్ల కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు..అనంతరం బాలరాజు పల్లి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రభుత్వ విప్ ప్రారంభించారు.





# వేములవాడ ఆలయ అభివృద్ధిపై రాజకీయ అరాచకాలు

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధిపై చేపట్టిన చర్యలను కొన్ని రాజకీయ పార్టీలు భగ్నం చేయాలని చూస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆలయ విస్తరణకు ప్రభుత్వం రూ.76 కోట్లు కేటాయించగా, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధికి అడ్డు తగులుతున్నారని తీవ్ర విమర్శలు చేశారు. "రాజకీయ వ్యాఖ్యాలతో బంద్ పిలుపులు ఇస్తూ, భక్తులకు ఇబ్బందులు కలిగించడాన్ని ప్రజలు సమర్థించరు," అని ఆయన అన్నారు. ఆలయం మూసివేతపై వస్తున్న ఆరోపణలను ఖండించిన ఆయన, "ఆలయ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. పూజా కార్యక్రమాలు యధావిధిగా కొనసాగుతాయి," అని స్పష్టం చేశారు.ప్రభుత్వం వేములవాడ ఆలయాన్ని దక్షిణ కాశీగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తోందని తెలిపారు. ఇప్పటికే రూ.47 కోట్లు జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని, రూ.76 కోట్లతో టెండర్ ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. 2024-25, 2025-26 బడ్జెట్లలో మొత్తం రూ.150 కోట్లు కేటాయించారని వివరించారు.అభివృద్ధి పనుల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, శృంగేరి పీఠాధిపతుల సూచనల ప్రకారమే పనులు జరుగుతున్నాయని తెలిపారు. "భక్తుల అభిప్రాయాలు వినేందుకు మేము ఎప్పుడూ సిద్ధం. కానీ అసత్య ప్రచారాలతో ప్రజలను గందరగోళపరిచే ప్రయత్నాలు చేయకండి," అని విజ్ఞప్తి చేశారు."ఈ దేవాలయం ఎవరి వ్యక్తిగత స్థలమూ కాదు. ఇది పరమశివుని నిలయం. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి," అని ఆయన అన్నారు.

# సీనియర్ విలేకరి తిరుపతికి పితృ వియోగం.



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)గత మూడు దశాబ్దాలుగా విలేకరి వృత్తిలో తనదైనశైలితో అందరితో కలిసి ప్రయాణం చేస్తున్నారు తిరుపతి.ఆయన తండ్రికి గుండె పోటుతో గత వారం రోజుల క్రితం స్వర్గస్తులయ్యారు.విషయం తెలుసుకున్న బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ నిన్న బుధవారం "మిడ్జిల్ మండల్ మహబూబ్నగర్ జిల్లా"కి వెళ్లి సీనియర్ పాత్రికేయులు తిరుపతి తండ్రి మారేపల్లి అంజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అలాగే వారి కుటుంబాన్ని,తిరుపతిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రభ సీనియర్ రిపోర్టర్ వెంకన్న, నమస్తే తెలంగాణ సీనియర్ రిపోర్టర్ తిరుపతి, మన తెలంగాణ సీనియర్ రిపోర్టర్ రమేష్,119 డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రి యాదగిరి, మన్నే వెంకట్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బీరప్ప జాతరకు హాజరైన చల్మెడ



వేములవాడ, (ప్రశ్న న్యూస్) వేములవాడ రూరల్ మండలం,బాలరాజుపల్లి గ్రామంలో బుధవారం జరుగుతున్న బీరప్ప జాతర ఉత్సవాలకు, అలాగే నమిలిగుండుపల్లి గ్రామంలో జరుగుతున్న బీరప్ప జాతరకు బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మనోహర్ రెడ్డి లు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట మండల అధ్యక్షుడు గోస్కుల రవి, నాయకులు ఏస తిరుపతి, గడ్డం హన్మండ్లు, బండ శ్రీనివాస్, నాగుల అనిల్ కుమార్, గాజర్ల మహేష్, కొత్త దేవయ్య, ముత్త మల్లేశం, పరుశరాములు, మాసయ్య, సత్తిరెడ్డి, గుడిసె దేవరాజ్, నమిలిగుండుపల్లి యాదవ సంఘం అధ్యక్షులు అల్లంపట్ల కనకయ్య యాదవ కులస్తులు బోడపట్ల మల్లేశం, గుంటి అయిలయ్య, పిల్లి రవి, బోడపట్ల వెంకటి, నాయకులు వంశీరెడ్డి, నితిన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# శ్రీశైలంలో మద్యం పట్టివేత




శ్రీశైలం (ప్రశ్న న్యూస్ ) శ్రీశైలం ద్వాదశ జ్యోతిర్లింగాలైనటువంటి మహా క్షేత్రంలో, శ్రీశైలం వన్ టౌన్ సిఐ ప్రసాద్ రావు 14వ తారీఖు మధ్యాహ్నం శ్రీశైలం దేవస్థానం టోల్గేట్ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహించాగా ఆర్టీసీ బస్సులో 50 మద్యం సీసాలు తీసుకొని వస్తుండగా తనిఖీల్లో భాగంగా పట్టుబడ్డారు. నంద్యాల జిల్లా శ్రీశైలం గ్రామం నివాసం ఉంటున్న బిబి, పిక్కిలి రేణుక అను ఇద్దరు మహిళలు సున్నిపెంట నుండి శ్రీశైలం కి మద్యం తరలిస్తుండగా పట్టుబడ్డారు వారి దగ్గర నుండి సిఐ ప్రసాద్ రావు సిబ్బంది రఘునాథుడు బాలకృష్ణ బాలాజీ నాయక్ వెంకటనారాయణ కృష్ణవేణి దేవస్థాన సిబ్బంది హెూంగార్డ్లస్ కిరణ్ కుమార్ దొరబాబు మద్యం ని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు.

# బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్న

## భాజపా జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి



వేములవాడ(ప్రశ్న న్యూస్) వేములవాడ రూరల్ మండలం, బాలరాజుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న బీరప్ప కామరాతి ఉత్సవాల్లో బాలరాజుపల్లి మాజీ సర్పంచ్ ల పోరం అధ్యక్షులు ఏష తిరుపతి,బిజెపి గ్రామ బూత్ అధ్యక్షులు బండ గోపాల్ ఆహ్వానం మేరకు దర్శనం చేసుకున్న బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో వర్షాలు బాగా కురిసి రైతులకు అధిక దిగుబడి రావాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని,ఆ దేవుని ప్రార్థించానని అన్నారు, ఈ కార్యక్రమంలో బాలరాజు పల్లి మాజీ సర్పంచ్ ఏస తిరుపతి, బిజెపి బూత్ అధ్యక్షులు బండ గోపాల్ బిజెవైఎం సంఘం పెద్దమనుషులు ముత్త మల్లేశం గాజర్ల లింగయ్య గాజర్ల మహేష్ నాగుల భూమయ్య రంగి రాజయ్యా మండల అధ్యక్షులు జంగం వంశీ, నుకలమర్రి బూత్ అధ్యక్షులు లింగంపల్లి కిషోర్,ఏడుమ్యకల మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

# నిశ్చితార్థ వేడుకల్లో... చల్మెడ లక్ష్మీ నరసింహారావు



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ మున్సిపల్ పరిధిలోని 11వార్డు సీనియర్ నాయకులు గన్నమనేని రామారావు కుమారుని నిశ్చితార్థ వేడుక సిరిసిల్లలోని పద్మనాయక కళ్యాణమండపంలో బుధవారం జరగగా ఈ వేడుకకు బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు.వారి వెంట నాయకులు వెంగళ శ్రీకాంత్, రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, నాయకులు సురేష్,కనుకయ్య, తదితరులు ఉన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన చల్మెడ



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గం,చందుర్తి మండలం కేంద్రానికి చెందిన ప్యాక్స్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్ కూతురు వివాహం బుధవారం కరీంనగర్ లోని మాచర్ల గార్డెన్లో జరగగా బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి,ఉప్పులుటి గణేష్,గెంటె ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

# విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రతీ ఫిర్యాదు పై వేగంగా స్పందించాలి
- నేర నియంత్రణ కు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
- జిల్లా ఎస్పీ : మహేష్ బి.గితే
- బోయినిపల్లి పోలీస్ స్టేషన్ను సందర్శించిన ఎస్పీ మహేష్ బి.గితే




బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి పోలీస్ స్టేషన్ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే (ఐపిఎస్) బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్లో 5%ూ% అమలు, స్టేషన్ సిబ్బంది విధినిర్వహణ, కేసుల నమోదు, పెండింగ్ ఫైళ్ల పరిస్థితి, రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర విభాగాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచనలు



చేస్తూ... "ప్రతీ ఫిర్యాదుపై వేగంగా స్పందించాలి. బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి" అని ఆయన ఆదేశించారు. స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామాల్లో నేరాల నివారణకు పోలీస్లు తరచూ పర్యటనలు చేయాలని సూచించారు. పాత నేరస్థులు,రౌడీషీటర్లపై నిఘా ఉంచాలని,నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ సూచించారు. ప్రజలతో పోలీసులు సత్సంబంధాలు కలిగి ఉండాలని, ముఖ్యంగా యువతలో సైబర్ నేరాలపై అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందన్నారు.రోడ్డుప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి చర్యలు చేపట్టాలని, స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహించాలని సూచించారు.ఈ సందర్శనలో వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,బోయినిపల్లి ప్రొబేషనరీ సబ్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్,తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బంద్ కు ప్రజల నుంచి స్పందన లేదు

- వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు : చంద్రగిరి శ్రీనివాస్




వేములవాడ, (ప్రశ్న న్యూస్) ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు వేములవాడ బంద్కు చేసిన పిలుపు ప్రజల్లో ఎలాంటి స్పందనను రేకెత్తించలేకపోయిందని వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ విమర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంద్ పూర్తిగా విఫలమైందని పేర్కొంటూ, ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, రాజకీయ అప్రజాస్వామిక ప్రయత్నాలను తిరస్కరిస్తున్నారని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా రాజన్న గుడి అభివృద్ధి ఆగదని వారు స్పష్టం చేశారు.వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంలో రాజన్న గుడి అలాగే వేములవాడ పట్టణ అభివృద్ధి పథంలో వేగంగా ముందుకెళ్తోందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చిలక రమేష్, పులి రాంబాబు, తోట రాజు, నాగుల రవీందర్, నాగుల విష్ణు,నాగుల రాము,సాబీర్, అబ్బాటి చందు,దూలం భూమేష్,అక్కనపెల్లి నరేష్, కుతాడి రాజేశం,అరుణ్ తేజ చారి, కొక్కుల బాలు,గుర్రం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడి ఆత్మహత్య



కీసర (ప్రశ్న న్యూస్)మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని చీర్యాల ప్రభుత్వ పాఠశాలలో బార్లపాటి వర్ధన్ (17) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది,బుధవారం పాఠశాల ఆవరణలో క్రికెట్ ఆడుతున్న సమయంలో పిల్లల బాల్ వెళ్లి తరగతి గదిలో పడడంతో బాల్ కోసం వెళ్లిన పిల్లలకు ఫ్యాన్ కి ఉరివేసుకున్న వ్యక్తినిగమనించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. కీసర సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం బార్లపాటి వర్ధన్ గత సంవత్సరం 9 వ తరగతి నుండి స్కూల్ మానేశాడని, 2025 లో ఓపెన్ స్కూల్ లో 10 వ తరగతి పరీక్ష రాసి విద్యుత్ శాఖలో ప్రైవేటు ఉద్యోగిగా వర్ధన్ చీర్యాల్లో కరెంట్ బిల్స్ ఇంటింటికి ఇచ్చేవాడని తెలిపారు. వర్ధన్ ఇంట్లో నుండి వెళ్ళి మూడు రోజులు అయింది కుటుంబ సభ్యులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిగా తెలియాల్సి ఉందని తెలిపారు.పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించిన పోలీసులు. కేసు నమోదు చేసుకున్న కీసర పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- టియుసిఐ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్ రమేష్



**ధర్పల్లి(ప్రశ్న న్యూస్)** ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం కోసం ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) ధర్పల్లి మండల కేంద్రం లో పోస్టర్ ఆవిష్కరణ, ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రమేష్ పిలుపునిచ్చారు, ఈ సందర్భంగా(టియుసిఐ) నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా,ప్రధాన కార్యదర్శి ఆర్ రమేష్ మాట్లాడుతూ గత 11 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయన్నారు. అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగినాయని, కానీ కార్మికుల వేతనాలు పెరగలేదన్నారు. కార్మికులకు ఉద్యోగ,ఆరోగ్య భద్రత కరువైందన్నారు.మోడీ ప్రభుత్వం అవలంబించిన కార్పోరేట్ కంపెనీల అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలే ఇందుకు కారణమన్నారు. మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కనీస వేతనాల అమలు కోసం, కనీస పెన్షన్ 9వేల అమలు కోసం, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా, పనిగంటల పెంపుదలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఈ సమ్మెలో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఈ కార్యక్రమంలో సుమన్,జీపీ కార్మికుడు కృష్ణ, బీడీ కార్మికులు స్వరూప,రజిని, లక్ష్మి, రజిత, శారద, షాహినా బేగం, మారు,తదితరులు పాల్గొన్నారు.

# పేదల కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిరంతరం

- సీపీఐ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి : కడారి రాములు



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ అర్బన్ మండలంలోని సంకెపల్లి గ్రామంలో జరిగిన సీపీఐ పార్టీ సమావేశంలో వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి కడారి రాములు మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీలు బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం చేసిన సేవలు మరువలేనివని అన్నారు. గతంలో సీపీఐ మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరరావు పేదల కోసం అనేక ఎకరాల భూమిని పంపిణీ చేశారని, అలాంటి ప్రజాపక్షపాత పార్టీలను రాబోయే గ్రామ, వార్డు, మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఆయన పేర్కొన్నారు. 100 సంవత్సరాల సుదీర్ఘమైన కమ్యూనిస్టు చరిత్రలో జరిగిన ఉద్యమాలు పేదల ఊపిరి అని పేర్కొన్నారు. సీపీఐ పార్టీ ప్రజాసేవ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతోందని కడారి రాములు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ శాఖ కార్యదర్శి పండుగ పోచమల్లు, పండుగ అంజయ్య, పండుగ చంద్రయ్య, జిలక రాములు, బుర్ర మహేందర్, పోచంపల్లి దేవయ్య, జింక కొండయ్య, వేములవాడ పట్టణ కార్యదర్శి గాజుల పోశెట్టి, తేళ్ల దేవరాజు, కోరెపు శ్రీను, గాజుల మల్లయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

# శుభకార్యంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ నియోజకవర్గంలోని చందుర్తి మండలం, నర్సింగాపూర్ గ్రామంలో బుధవారం జరిగిన వంగ సత్తయ్య-పద్మ దంపతుల కుమార్తె లహరిక - ప్రవీణ్ నిశ్చితార్థ వేడుకల్లో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై కాబోయే నూతన జంటను ఆశీర్వదించారు, ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నాగం కుమార్, మాజీ సర్పంచి అమర బండ శ్రావణ్ నాయకులు అమర బండ సాయి, గంట మల్లేశం,మ్యాకల పర్శరాములు, కోరుట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 20 రోజుల రాజన్న హుండీ ఆదాయం

# రూ.1.65 కోట్లు



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి 20 రోజుల హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించగా రూ. 1,65,84,607 నగదు, 204 గ్రాముల,500 మిల్లీ గ్రాముల బంగారం,13.200 కిలోల వెండి ఆదాయం సమకూరింది.ఆలయ ఈఓ కె.వినోద్, కరీంనగర్ సహాయ కమిషనర్ కార్యాలయ అధికారి సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ ఉద్యోగులు,శ్రీ రాజ రాజేశ్వర సేవ సమితి వారిచే లెక్కించడం జరిగింది.ఎస్పీఎఫ్,హోమ్ గార్డులు భద్రతా చర్యలు నిర్వహించారు.

# శవాలను కొంటాం

## - మీ బంధువులదైనా.. పక్కింటివాళ్లదైనా.. తీసుకొచ్చేయండి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రైవేటు వైద్య కళాశాలల్లో మృతదేహాల కొరత తీవ్రంగా ఏర్పడింది. వైద్య విద్యలో శరీర నిర్మాణం, అవయవాల పనితీరుపై అవగాహన కోసం విద్యార్థులకు మృతదేహాలు కీలకం. అయితే ప్రైవేటు కళాశాలలు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తుండటంతో మృతదేహాల కొరత ఏర్పడింది. దీంతో కొన్ని కళాశాలలు అనైతిక మార్గాల్లో మృతదేహాలను సేకరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలలు మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాల పేద కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని దళారుల ద్వారా మృతదేహాలను కొనుగోలు చేస్తున్నాయని సమాచారం. మృతదేహానికి లక్ష రూపాయల వరకు చెల్లించడానికి కూడా సిద్ధపడుతున్నారని తెలుస్తోంది. అంత్యక్రియల ఖర్చు తప్పుతుందని, పైగా డబ్బు కూడా వస్తుందని దళారులు పేదలను నమ్మిస్తున్నారని ఆరోపణలున్నాయి.ప్రభుత్వ వైద్య కళాశాలలకు మృతదేహాలు రెండు రకాలుగా వస్తాయి. అనాథల మృతదేహాలు, రోడ్డు ప్రమాదాల్లో గుర్తుపట్టలేనంతగా దెబ్బతిన్న మృతదేహాలను కుటుంబ సభ్యులు గుర్తించకపోతే ఆసుపత్రులు స్వీకరిస్తాయి. ఇక కొందరు చనిపోయాక తమ శరీరాన్ని వైద్య కళాశాలలకు దానం చేయమని వీలునామా రాస్తుంటారు. ఇలాంటి మృతదేహాలకు ప్రభుత్వ వైద్య కళాశాలలకు కొరత ఉండదు. అయితే కొత్తగా ప్రైవేటు వైద్య కళాశాలలు పెరగడంతో వాటికి మృతదేహాల కొరత ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలలు వైద్య విద్య డైరెక్టరేట్‌కు లేఖలు రాశాయి. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాల ప్రకారం ప్రతి వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీట్ల సంఖ్య ఆధారంగా అనాటమీ విభాగానికి మృతదేహాలు అవసరం. సాధారణంగా 250 సీట్లు ఉన్న వైద్య కళాశాలకు ఏడాదికి సగటున 10 మృతదేహాలు అవసరం. ఎంబిబిఎస్ మొదటి సంవత్సరంలోనే అనాటమీ ఒక ముఖ్యమైన సబ్జెక్టుగా ఉంటుంది. వైద్య విద్యలో భాగంగా మృతదేహాలను కోసి శరీర నిర్మాణం గురించి విద్యార్థులకు వివరిస్తారు. తర్వాత ఆ మృతదేహాలను ప్రత్యేక రసాయనాలతో నింపిన ఫార్మాలిన్ ట్యాంకుల్లో భద్రపరుస్తారు. దీని ద్వారా వైద్య విద్యార్థులకు మానవ శరీరంపై అనుభవపూర్వక జ్ఞానం వస్తుంది. కొన్ని వైద్య కళాశాలలు మృతదేహాలకు బదులుగా రబ్బరు బొమ్మలను ఉపయోగిస్తున్నాయి. అయితే మానవ శరీరంపై ప్రత్యక్ష అనుభవం లేకపోవడం వల్ల విద్యార్థులకు పూర్తి అవగాహన రాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోని మార్చురీల్లోని అన్‌క్లెయిమ్డ్ మృతదేహాలను ప్రైవేటు కళాశాలలకు విక్రయించేందుకు అనుమతిస్తూ గతంలో ప్రభుత్వం ఒక ఉత్తర్వు జారీ చేసింది. అయితే దీనిపై నైతికపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా ప్రవేట్ వైద్య కళాశాలలు ఇలా దళారుల ద్వారా శవాలను కొని పరిశోధనలకు ఉపయోగించడం ఆందోళన కలిగిస్తోంది.

# అనారోగ్యంతో ఇస్మాయిల్ మృతి

భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కూనంనేని, సాబీర్ పాషా



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) డివికె యూత్ సభ్యులు అలి సోదరుడు ఇస్మాయిల్ మృతి చెందిన విషయం తెలుసుకున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా ఇస్మాయిల్ భౌతికకాయనికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్యపడవద్దని అండగ ఉంటామని హామీ ఇచ్చారు. వారి వెంట సిపిఐ పార్టీ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాశి వెంకన్న, వైఎన్ఆర్ యూత్ యాంద్ర మహేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ హాస్పిటల్స్ నర్సింగ్ హెూమ్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ (తానకాన్ 2025) అనువల్ కాన్ఫరెన్స్

**-జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కు ఆహ్వాన పత్రికను అందజేసిన తానకాన్**

**-2025 మే 24,25 వ తేదీలలో తానకాన్ 2025 అనువల్ కాన్ఫరెన్స్**



జగిత్యాల జిల్లా బ్యూరో(ప్రశ్న న్యూస్) జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కలిసి ఆహ్వాన పత్రికను జగిత్యాల తనకాన్ కార్యవర్గం అందజేసారు.2025 మే 24,25 వ తేదీలలో కరీంనగర్ లో నిర్వహించనున్న తానకాన్ 2025 అనువల్ కాన్ఫరెన్స్ కు హాజరు కావాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కోరారు. తనకాన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు డా.సురేష్ కుమార్, కార్యదర్శి అజయ్ రెడ్డి, కరీంనగర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రాజకుమార్ , కోశాధికారి మహేష్ ,డాక్టర్ శశి కాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలు కుటుంబానికి చల్మెడ పరామర్శ...! ప్రగాఢ సంతాపం...!!



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన పోకల నారాయణ తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను బుధవారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి,ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, గ్రామశాఖ అధ్యక్షులు రత్నాకర్,నిమ్మపల్లి మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ రాజయ్య, నాయకులు సత్తయ్య, చంద్రయ్య,వెంకటేష్,, గోసుకుల రవి, వెంగళ శ్రీకాంత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# రాజన్న ఆలయంలో నెలకొన్న భక్తుల రద్దీ



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర పుణ్యక్షేత్రం బుధవారం భక్తుల రద్దీతో నెలకొంది.రాజన్న భక్తులు ఉదయాన్నే ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, కోడె మొక్కులు చెల్లించుకొని, స్వామి వారిని దర్శించుకున్నారు .భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.కాగా బుధవారం సాయంత్రం 6:30 వరకు సుమారుగా 42,539 భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

# శ్రీ శివరామ నంద సరస్వతి స్వామిని కలిసిన బద్వేలు సర్పంచులు మున్సిపల్ కౌన్సిలర్లు



**బద్వేలు** శ్రీ శ్రీ శ్రీ శివరామానంద సరస్వతి స్వామి ( బద్వేల్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ శివరామకృష్ణ రావు ) వారిని బద్వేల్ మండలము బద్వేల్ మున్సిపాలిటీకి చెందిన సర్పంచులు, మాజీ సర్పంచులు, బద్వేల్ మండల ఉపాధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డ్ ఇన్చార్జులు, తదితరులు బుధవారం పోరుమామిళ్ళ వారి నివాసం నందు మర్యాదపూర్వకముగా కలిసి స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం జరిగినది. ఈ సందర్భముగా బద్వేల్ నియోజకవర్గ రాజకీయ స్థితిగతుల గురించి కూడా స్వామివారికి వివరించడం జరిగినది×శ్రీ శ్రీ శ్రీ శివరామానంద సరస్వతి స్వామి వారిని బద్వేల్ మండలము మరియు బద్వేల్ మున్సిపాలిటీకి చెందిన సర్పంచులు, మాజీ సర్పంచులు, బద్వేల్ మండల ఉపాధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డ్ ఇన్చార్జులు, తదితరులు పోరుమామిళ్ళ వారి నివాసం నందు మర్యాదపూర్వకముగా కలిసి స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం జరిగినది. ఈ సందర్భముగా బద్వేల్ నియోజకవర్గ రాజకీయ స్థితిగతుల గురించి కూడా స్వామివారికి వివరించడం జరిగినది

# నేడు భారత స్వాతంత్రోద్యమ విప్లవ వీరుడు సుఖ్ దేవ్ జయంతి




సుఖ్ దేవ్ థాపర్ లూధియానాలో 15 మే 1907 జన్మించారు. ఈయన భారత స్వాతంత్ర్య సమర, ఉద్యమకారుడు. ఇతను భగత్ సింగ్, రాజ్‌గురు ల సహచరునిగా ప్రసిద్ధి. 1928 లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ ప్రభుత్వం పై పగతీర్చుకోవడానికి, ఫిరోజ్ పూర్ లో బ్రిటిష్ పోలీసు అధికారి "జె.పి. సాండర్స్" ను హతమార్చినందులకు గాను మార్చి 23 1931 న అతి చిన్న వయసులో ఉరితీయబడ్డాడు. భగత్ సింగ్,రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఈ ముగ్గురు విప్లవకారులను 1931 మార్చి 23న లాహోరు సెంట్రల్ జైలులో సాయంకాలం గం. 7.33 ని.లకు సమయానికి ఉరి తీశారు. అప్పటి నిబంధనల ప్రకారం ఆ సమయంలో ఉరిశిక్ష అమలు జరపడం జరిగేది కాదు. వారి మృత దేహాలను రహస్యంగా, జైలు వెనుక గోడలు పగులగొట్టి తీసికొని వెళ్ళి సట్లెజ్ నది తీరాన హుస్సేన్‌వాలా అనే ఊరిలో దహనం చేసేవారు. మృత దేహాలను చూసిన ప్రజలలో అలజడిని ఎదుర్కోకుండా ఇలా చేశారు.

# రెసిడెన్షియల్ అనుమతులు
# కమర్షియల్ నిర్మాణాలు

## - ఏసీపి బాల శ్రీనివాస్ కనుసైగల్లోనే

- మల్కాజిగిరిలో యథేచ్చగా అక్రమ నిర్మాణాల జోరు
- సర్కిల్ పరిధిలో వెల్లువెత్తుతున్న అక్రమ కట్టడాలు
- అసలు పట్టించుకొని టౌన్ ప్లానింగ్ అధికారులు







**మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్)** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. నివాస అవసరాల కోసం అనుమతులు పొంది, వాణిజ్య భవనాలను అంతస్తుల కొద్దీ నిర్మిస్తున్నా టౌన్ ప్లానింగ్ ఏసీపి బాల శ్రీనివాస్, ఉన్నత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన రహదారులకు పక్కనే భారీ వాణిజ్య సముదాయాలు నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్నా, టౌన్ ప్లానింగ్ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్కిల్ పరిధిలోని మౌలాలీ, గౌతంనగర్, వినాయక్ నగర్, నేరేడ్మేట్, ఈస్టుఆనంద్ బాగ్, మల్కాజిగిరి డివిజన్ లపరిధిలోని పలు కాలనీల్లో నిబంధనలను తుంగలో తొక్కి దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా, అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని, వారి కనుసన్నల్లోనే ఈ అక్రమ దందా నడుస్తోందని బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల ఫిర్యాదులు అందినప్పటికీ, నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతూ, అక్రమ నిర్మాణదారులకు కొమ్ముకాస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెట్‌బ్యాక్‌లు వదలకుండా, అనుమతించిన అంతస్తుల కంటే అధికారులకు లంచాలు ఇచ్చి అదనంగా నిర్మించడం, పార్కింగ్ స్థలాలను దుకాణాలుగా మార్చేయడం వంటి ఉల్లంఘనలు సర్వసాధారణంగా మారాయి. ఈ అక్రమ నిర్మాణాల వల్ల కాలనీల్లో మౌలిక సదుపాయాలపై తీవ్ర ఒత్తిడి పడుతోందని, డ్రైనేజీ వ్యవస్థలు పొంగిపొర్లుతున్నాయని, ట్రాఫిక్ సమస్యలు అధికమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

### పట్టించుకునే నాథుడే కరువు

జిహెచ్ఎంసి లో అవినీతి అక్రమాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సాక్షాత్ జిహెచ్ఎంసి కమిషనర్ కు ఫిర్యాద చేసిన స్పందించే దిక్కు లేకపోవడంతో ఇక ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితిలో ప్రజలు సతమతమవుతున్నారు. ప్రజావాణి కార్యక్రమానికి వారాలకు వారాలు తిరిగి ఫిర్యాదులు చేసిన ఒక్క ఫిర్యాదును కూడా తీర్చకుండా అధికారులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో, అక్రమార్కులకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి, మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నివాస గృహాలకు అనుమతులు పొంది యథేచ్ఛగా వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నా, అదనపు అంతస్తులు వెలుస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు అసలు పట్టించుకోవడం లేదని అధికారులు డ్యూటీ చేస్తున్నారా నిద్రపోతున్నారా అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు కాలనీల్లో, ప్రధాన రహదారులకు పక్కనే ఈ అక్రమాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### అధికారుల కనుసన్నల్లోనే అక్రమాలు.?

జిహెచ్ఎంసిలో టౌన్ ప్లానింగ్ విభాగము నందు అధికారులు లంచాలు తీసుకొని అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తున్నారు అనేది బహిరంగ రహస్యంగా మారింది అయినా చర్యలు తీసుకోవలసిన ప్రభుత్వం కళ్లులేని కబోదిలా వ్యవహరించడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మల్కాజ్‌గిరి, మౌలాలీ, గౌతంనగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, వినాయక్ నగర్, నేరేడ్‌మెట్ డివిజన్ల పరిధిలోని అనేక ప్రాంతాల్లో నిబంధనలు గాలికొదిలేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ముఖ్యంగా నేరేడ్‌మెట్ నుండి మల్కాజ్‌గిరి వెళ్లే ప్రధాన రహదారి, యాప్రాల్ ప్రధాన రహదారి వెంబడి రెసిడెన్షియల్ పర్మిట్లతో భారీ వాణిజ్య భవనాలు, అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. సెల్లార్లు, షెట్టర్లు, పెంట్ హౌస్‌ల నిర్మాణాలు కూడా విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ఈ అక్రమ నిర్మాణాల వెనుక టౌన్ ప్లానింగ్ ఏసీపి బాల శ్రీనివాస్ సెక్షన్ ఆఫీసర్, స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయని, వారికి అందాల్సిన 'ముడుపులు'



అందుతుండటంతోనే చర్యలు తీసుకోవడం లేదని బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు చేసినా నామమాత్రంగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని, కొన్ని సందర్భాల్లో కూల్చివేతలు చేపట్టినా అవి మొక్కుబడిగా ఉంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వ ఆదాయానికి గండి, ప్రజలకు ఇబ్బందులు

నివాస అనుమతులతో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అంతేకాకుండా, అక్రమ నిర్మాణాల వల్ల పార్కింగ్ సమస్యలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, మౌలిక వసతులపై తీవ్ర ఒత్తిడి పడుతోందని కాలనీవాసులు చెబుతున్నారు. ఇప్పటికైన జీహెచ్ఎంసీ కమిషనర్ ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్ స్పందించి మల్కాజ్‌గిరి సర్కిల్‌లో వెలుస్తున్న అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమనిర్మాణలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో మల్కాజిగిరి సర్కిల్ మొత్తం అక్రమ కట్టడాలమయంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రంగారెడ్డిలో రాబందువుల వేట,రంగంలోకి హైడ్రా

- ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో ఆలస్యం ఎందుకు.?
- ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో హైడ్రా దూకుడు పెంచాలని ప్రజల డిమాండ్





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ ఆస్తులను కాపాడడం, విపత్తు నిర్వహణ కోసం ఏర్పాటు చేసినదే హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) దీనివిధి విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిన విషయం అందరికి తెలిసిందే.అలాగే గతంలో ప్రభుత్వం జీవో నెంబర్ "99"జారీ చేసిన విషయం కూడా తెలిసిందే. అదిగాక జిహెచ్ఎంసితో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్,సంగారెడ్డి జిల్లాలను కలుపుకొని అలాగే ఓఆర్ఆర్ వరకు హైడ్రాకు చర్యలు తీసుకోవడానికి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ముఖ్యంగా హైడ్రా ఛైర్మన్ గా రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తారు.అలాగే జిహెచ్ఎంసి చుట్టూ ఉన్న ఇరవై ఏడు మున్సిపాలిటీలు, కార్పోరేషన్లు, అలాగే ముప్పై మూడు మేజర్ గ్రామ పంచాయతీలు హైడ్రా నేతృత్వంలోనే కొనసాగుతున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో హైడ్రా ఏర్పడినప్పటి నుంచి ప్రజలనుంచి భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి.అలాగే రోజు రోజుకీ కంప్లైంట్స్ సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది అంటూ హైడ్రా అధికారులు తెలిపారు.వీరి సంఖ్య ఆన్ లైన్ లో కూడా ఘననీయంగా పెరగడం వల్ల హైడ్రాను ప్రజలు స్వాగతిస్తున్నారని హైడ్రా కమీషనర్ రంగనాథన్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. హైడ్రాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ఏ విధంగా విధులు నిర్వహిస్తుందో కూడా కొన్ని ప్రైజటేషన్ ఇచ్చిన విషయం అందరికి తెలిసిందే. గతంలోనిర్మాణాలను తొలగించకుండా, కొత్తగా హైడ్రా దృష్టికి వచ్చినా, లిఖితపూర్వకంగా ఫిర్యాదులు వస్తే ఉరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు కమీషన్. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు హైడ్రా దృష్టికి సుమారు పదివేల ఫిర్యాదులు అందాయి. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రంగనాథ్ గతంలో వివరించారు.ఈ నేపథ్యంలో రాచకొండ కమీషనరేట్ పరిధిలో ఉన్న రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడలో హైడ్రా కమీషనర్ ఏవి రంగనాథ్ పర్యటించారు.కోహెడ గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 951, 952లో ప్లాట్స్ ఓనర్స్,ఆ భూమి కొనుగోలు చేసిన సంరెడ్డి బాల్ రెడ్డి అనే వ్యక్తి మధ్య కొనసాగుతున్న వివాదం చినికి చినికి గాలి వానగా మారింది. ఇక్కడ వెంచర్ కు సంబంధించిన రోడ్డును కబ్జా చేసి ఫార్మ్ హౌజ్ నిర్మిస్తున్నారని గత ఫిబ్రవరిలో వచ్చిన ఫిర్యాదుతో అదే సమయంలో ఫార్మ్ హౌజ్ ను కూల్చివేసిన హైడ్రా యంత్రాంగం.కూల్చివేతలతో హై కోర్ట్ నుండి నాట్ టు ఇంటర్ఫియర్ తో పాటు ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్న ఫార్మ్ హౌజ్ ఓనర్ బాల్ రెడ్డి.గత రెండు నెలల క్రితం ప్లాట్స్ ఓనర్స్ కు మార్చ్ 28న అనుకూలంగా డిక్రీ ఇచ్చిన రంగారెడ్డి జిల్లా కోర్టు.న్యాయస్థానం ఇచ్చిన ఆర్డర్ తో ఈ నెల 1న ప్లాట్స్ ఓనర్స్ తమ ప్లాట్స్ క్లీన్ చేసుకుంటున్న సమయంలో అక్కడికి చేరుకున్న బాల్ రెడ్డి వర్గీయులు ప్లాట్స్ ఓనర్స్ మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది.ఈ గొడవలో ప్లాట్స్ ఓనర్స్ పై కొడ్డలి,కత్తులతో దాడికి దిగిన బాల్ రెడ్డితో పాటు ఆయన అనుచరులు వీరంగం సృష్టించారు.ఏమీ తెలియని ఆ అమాయక ప్రజలు తమ పై దాడి చేయడమే కాకుండా హత్య యత్నానికి పాల్పడినందుకు బాల్ రెడ్డి, వారి అనుచరులు పై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేస్తే సాధారణ గొడవగా చిత్రీకరించి ఇరు వర్గాలపై కేసు నమోదు చేసిన హయత్ నగర్ పోలీసులు. ఆ గొడవ జరిగిన సమయంలో మారణాయుధాలతో (కత్తులు,గొడ్డలి) అమాయకులు పై దాడి చేస్తే సాధారణ కేసుగా నమోదు చేస్తారా అంటూ పోలీసులపై ఫైర్ అయిన హైడ్రా కమీషనర్రంగనాథ్. హయత్ నగర్ పోలీసుల అండదండలు కబ్జాదారులకు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. ఇక్కడ జరుగుతున్న పరిణామాలతోనే హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు బాధితులకు భరోసా ఇచ్చిన రంగనాథ్.ఎవరు అధైర్యపడవద్దు వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.అలాగే బాధితులకు న్యాయం చేసే విధంగా హైడ్రా పనిచేస్తుందని కమీషనర్ రంగనాథన్ పేర్కొన్నారు.

## బీర్పూర్లో స్మగ్లర్లు అక్రమ ఇసుక డంపులు

- ఇసుకపై పశు గ్రాసం వేసి, ప్లాస్టిక్ కవర్ కప్పి ఇసుక కనిపించకుండా చేసిన స్మగ్లర్లు
- సీజ్ చేసిన తహసీల్దార్ ముంతాజ్ బుద్దీన్



**జగిత్యాల (ప్రశ్న న్యూస్)** జగిత్యాల జిల్లా బీర్పూర్లో స్మగ్లర్లు అక్రమ ఇసుక డంపులు ఏర్పాటు చేశారని సమాచారం అందుకున్న తహసీల్దార్ ముంతాజ్ బుద్దీన్ ఇసుక డంపుల వద్దకువెళ్లి చూడగా స్మగ్లర్లు ఇసుకపై పశు గ్రాసం వేసి, ప్లాస్టిక్ కవర్ కప్పి ఇసుక కనిపించకుండా చేసిన ప్రయత్నాన్ని అధికారులు గుర్తించారు.ఇసుక డంపులు పరిశీలించి వాటిని సీజ్ చేశారు. వారి వెంట ఆర్ ఐ రాహుల్ ఉన్నారు.

## అయోధ్య రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నరేందర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ఆర్టిఏ కమిషనర్ గా బోరెడ్డి అయోధ్య రెడ్డి ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించడం పట్ల సంతోషంగా ఉందని పోతుగంటి నరేందర్ అయోధ్య రెడ్డికి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయోధ్య రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు ఎంతో ఉన్నత బాధ్యతను అప్పగించారని దానిపై రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఆర్టిఏ చట్టాన్ని బలోపేతం చేస్తానని తెలిపారు.

## జేఎన్‌యూ కీలక నిర్ణయం

### - టర్కీ వర్సిటీతో ఒప్పందం నిలిపివేత




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) కీలక నిర్ణయం తీసుకుంది. టర్కీకి చెందిన ఇనోను విశ్వవిద్యాలయంతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. భారత్–పాకిస్థాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, ఈ వివాదంలో పాకిస్థాన్‌కు టర్కీ బాహాటంగా మద్దతు ఇస్తున్న నేపథ్యంలో జేఎన్‌యూ తీసుకున్న ఈ చర్య ప్రాధాన్యతను సంతరించుకుంది.జేఎన్‌యూ, టర్కీలోని ఇనోను విశ్వవిద్యాలయం మధ్య ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం మూడేళ్ల పాటు, అంటే 2028 ఫిబ్రవరి 2 వరకు అమల్లో ఉండాల్సిందని జేఎన్‌యూ అధికారిక వెబ్‌సైట్ పేర్కొంది. అయితే, బుధవారం (మే 14) నాడు జేఎన్‌యూ తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా ఈ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది."జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా, టర్కీలోని ఇనోను విశ్వవిద్యాలయంతో జేఎన్‌యూ కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నిలిపివేయబడింది. జేఎన్‌యూ దేశానికి అండగా నిలుస్తుంది" అని ఆ పోస్టులో స్పష్టం చేసింది. భారత్‌కు వ్యతిరేకంగా తప్పుడు సమాచారం, దుష్ప్రచారం చేస్తుందన్న ఆరోపణలపై టర్కీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని వార్తా సంస్థ 'టీఆర్టీ వరల్డ్' ఎక్స్ ఖాతాలను భారత ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసిన రోజే జేఎన్‌యూ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇటీవలి కాలంలో భారత్‌లో టర్కీ ఉత్పత్తులు, సేవలను బహిష్కరించాలనే డిమాండ్ కూడా ఊపందుకుంది.'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్‌కు వ్యతిరేకంగా టర్కీ, అజర్‌బైజాన్‌లు వ్యవహరించిన తీరు పట్ల నిరసనగా, ఆ దేశాలకు వెళ్లేందుకు భారతీయ పర్యాటకులు పెద్ద ఎత్తున తమ ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారని, కొత్త బుకింగ్‌లు గణనీయంగా తగ్గాయని ప్రముఖ ఆన్‌లైన్ ట్రావెల్ బుకింగ్ సంస్థలు మేక్‌మైట్రిప్, ఈజ్‌మైట్రిప్ వెల్లడించాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588